ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 10 జూన్ 2025

ఉష్ణోగ్రత (అంచనా)

10-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	42	28
తెనాలి	42	27
నరసరావుపేట	42	28
బాపట్ల	41	29
రెంటచింతల	42	27
చీరాల	41	29

అసభ్యకర వ్యాఖ్యలపై ఆగ్రహం

- జగన్ మీడియాపై భగ్గుమన్న మహిళలు



మంగళగిరిలోని సాక్షి కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళలు



జగన్ మీడియా వేదికగా అమరావతి మహిళల గురించి చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై రెండో రోజు సోమవారం ఆగ్రహం పెల్లుబికింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మహిళలతో పాటు వివిధ వర్గాల ప్రజలు రోడ్డెక్కి ఆందోళనలు చేశారు. కొమ్మినేని, కృష్ణంరాజు ఫొటోలు, పత్రికా ప్రతులను దహనం చేశారు. రాజధాని మహిళలు, రైతులు మంగళగిరిలోని సాక్షి ప్రధాన కార్యాలయం ఎదుట చెప్పులు, చీపుర్లు, చేటలను చూపిస్తూ ధర్నా చేశారు. సాక్షి యాజమాని భారతీరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గుంటూరులోని జిల్లా కార్యాలయాన్ని మహిళలు ముట్టడించారు. పొన్నూరులో ఎమ్మెల్యే నరేంద్ర ఆధ్వర్యంలో, బాపట్లలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో ప్రదర్శనలు జరిగాయి.

– గుంటూరు, బాపట్ల ఆంధ్రజ్యోతి

క్వాలిటీ.. కుట్ర

- బర్లీ పొగాకు కొనుగోళ్లపై కంపెనీల దృష్టి
- మార్క్‌ఫెడ్ ప్రకటనతో గ్రామాలకు కంపెనీల ప్రతినిధులు
- లో క్వాలిటీ పొగాకు సంగతేమిటని ప్రశ్నిస్తున్న రైతులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

దాదాపు నెలన్నర రోజుల నుంచి బర్లీ పొగాకు కొనుగోళ్లపై కంపెనీలు స్పందించలేదు. అయితే చివరకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించడంతో ఇప్పుడు కంపెనీలు హడావుడి చేస్తు



పర్చూరులో పొగాకును పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ (పాత చిత్రం)

న్నాయి. అయితే రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని కాకుండా క్వాలిటీ అంటూ సరికొత్తగా కుట్రకు తెరలేపుతున్నాయి. గతంలో పలు దఫాలుగా సమావేశాలు పెట్టి హెచ్చరించినా అంతంత మాత్రంగానే కదిలిన కంపెనీలు ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ప్రకటనతో ఇప్పుడు కేవలం క్వాలిటీ పొగాకుపైనే దృష్టి పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మే చివరి వారంలో మార్టూరులో కంపెనీలతో నిర్వహించిన సమీక్షలో బర్లీ కొనుగోళ్లలో హైక్వాలిటీ (రూ.12,000), మీడియం, లోగ్రేడ్ (రూ.5,000 నుంచి రూ.6,000) రెండే రకాల ప్రామాణికాలు పాటించాలని మార్టూరులో జరిగిన సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. అయినా కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం ఆశించిన స్థాయిలో కంపెనీల నుంచి స్పందన లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించింది. పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో లాంఛనంగా కొనుగోలు కేంద్రాన్ని కూడా మార్క్‌ఫెడ్ ప్రారంభించింది. ఈ క్రమంలో గడచిన నాలుగు రోజులుగా అనూహ్యంగా కంపెనీలు స్వరం మార్చి క్వాలిటీ పొగాకు కొనుగోళ్ల కోసం రైతుల వద్దకు ఏజెంట్లను పంపిస్తున్నాయి. మార్క్‌ఫెడ్ ప్రకటనకు ముందు క్వింటాకు (మిగతా 6వ పేజీలో)



ప్రభుత్వ ఆమోదమే మిగిలింది!

- పంచాయతీలకు గ్రేడ్‌లు
- పల్నాడు జిల్లాలో పూర్తయిన ప్రక్రియ
- నివేదిక పంపిన అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంచాయతీ పాలనను ప్రభుత్వం ప్రక్షాళన చేస్తోంది. గ్రామల్లో ప్రజలకు సేవలను అత్యంత చేరువ చేసేందుకు పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తోంది. పాలన విధానంలో కూడా మార్పులు తీసుకొస్తోంది. పంచాయతీల్లో ఇప్పటి వరకు క్లస్టర్ల పాలన సాగింది. దీనికి స్వస్తి చెప్పి పంచాయతీలకు గ్రేడ్‌ల ను కేటాయిస్తోంది. ఆదాయం, జనాభా ఆధారంగా ఈ గ్రేడ్‌లు కేటాయించారు. ఈ ప్రక్రియ పల్నాడు జిల్లాలో పూర్తయింది. త్వరలోనే గ్రేడ్‌ల విధానం అమలులోకి తీసుకురానున్నారు. దీని ప్రకారం సిబ్బందిని కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

11 పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్..

ప్రస్తుతం పంచాయతీలు మైనర్, మేజర్‌లుగా ఉన్నాయి. కొన్ని మైనర్ పంచాయతీలకు ఒక మేజర్ పంచాయతీని కలిపి క్లస్టర్ పంచాయతీలు ఏర్పాటు చేశారు. ఈ విధానం 2010 నుంచి అమల్లోకి వచ్చింది. జిల్లాలో 529 పంచాయతీలు ఉన్నాయి. జనాభా 15,10,509 మంది. అన్ని పంచాయతీల ఆదాయం రూ.45.36 కోట్లుగా ఉంది. 11 పంచాయతీలను స్పెషల్ గేడ్‌కు ఎంపిక చేశారు. గ్రేడ్ -1 కింద 111, గ్రేడ్ -2 కింద 169, గ్రేడ్ -3 కింద 238 పంచాయతీలను ఎంపిక చేశారు. ఈ ఎంపిక ప్రక్రియ పూర్తయింది. మూడేళ్ల సరాసరి ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకొని గ్రేడ్‌లు కేటాయించారు. మూడేళ్లలో రూ.కోటి ఆదాయం దాటిన పంచాయతీకి స్పెషల్ గ్రేడ్ కేటాయించారు. 4 వేల నుంచి 10 వేల లోపు జనాభా ఉండి రూ.50 లక్షల నుంచి రూ.కోటి లోపు ఆదాయం ఉంటే పంచాయతీని గ్రేడ్ -1 కింద కేటాయించారు. 2 వేల నుంచి 4 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలను ఆదాయంతో సంబంధం లేకుండా గ్రేడ్ -2 కింద ఎంపిక చేశారు. 2 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడ్ -3 పరిధిలోకి తీసుకొచ్చారు. పంచాయతీల గ్రేడ్‌లపై ప్రభుత్వానికి అధికారులు నివేదిక పంపారు. ఇక ప్రభుత్వ అమోద ముద్ర పడాల్సిందే తరువాయి. గ్రేడ్‌ల విధానం అమల్లోకి వస్తే పంచాయతీల్లో సిబ్బంది పెరగడంతో పాటు పల్లెవాసులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

రేషన్ మాఫియా.. బరితెగింపు

రేషన్ డోర్ డెలివరీ లేదు. ఎండీయూ వాహనాలను ఆపేశారు. అయినా చాలాప్రాంతాల్లో ఎండీయూ ఆపరేటర్లు ఇళ్ల వద్దకు వస్తున్నారు.. రోడ్లపైనే బహిరంగంగా కార్డుదారులతో వేలిముద్రలు వేయించుకుంటున్నారు. సరుకులతో సంబంధం లేకుండా నగదు ఇస్తూ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలి స్తున్నారు. పేదల పొట్ట నింపాల్సిన ఉచిత బియ్యం మాఫియా జేబులను నింపుతోంది. అడ్డుకోవాల్సిన అధికారులు, వ్యతిరేకించాల్సిన ప్రజా ప్రతినిధుల అండతో రేషన్ మాఫియా బరితెగిస్తోంది. ఎండీయూలను రద్దు చేసిన ప్రభుత్వం కార్డుదారుల సౌలభ్యం కోసం ఎక్కడైనా రేషన్ తీసుకునే సౌలభ్యంతో పాటు ఈ-పోస్‌కు కాటాలకు లింకు తొలగించడంతో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల సహకారంతో మాఫియా చెలరేగిపోతోంది.

ఎండీయూలు రద్దు చేసినా వారిదే రాజ్యం

- వరంగా మారిన ఈ-పోస్, కాటా లింకు తొలగింపు
- బియ్యం లేకుండానే కార్డుదారులతో బహిరంగంగా వేలిముద్రలు
- డీలర్ అవతారమెత్తిన డాన్ అనుచర ఎండీయూ ఆపరేటర్



రోడ్డుపైనే వేలిముద్రలు వేయించుకుంటున్న డాన్ అనుచరుడు

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రేషన్ అక్రమాలను అడ్డుకోవడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం డోర్ డెలివరీ విధానాన్ని నిలిపివేసింది. ఎండీయూ వాహనాలను రద్దు చేసింది. అయినా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రేషన్ మాఫియా డోర్ డెలివరీ విధానాన్ని సరికొత్తగా నడుపుతోంది. ఎండీయూల స్థానే డీలర్లకు సమాంతరంగా ప్రత్యేకంగా వ్యవస్థను రూపొందించి నడిపిస్తోంది. లబ్ధిదారుల వద్దకే నేరుగా వెళ్లి సరుకులు ఇవ్వకుండానే ఇచ్చినట్లు వేలిముద్రలు తీసుకుని దర్జాగా అక్రమాలకు పాల్పడుతోంది. బహిరంగం. నడి రోడ్లపైనే రేషన్ డెలివరీ వ్యవహారాన్ని నడిపిస్తోంది. ఇటీవల డానియేలు అనే డాన్ అనుచరుడు దర్జాగా బెల్లెట్‌పై వచ్చి గుంటూరులోని లబ్ధిదారులతో వేలుముద్రలు వేయించుకుని నగదు ఇచ్చి వెళ్లాడు. దీనిని ప్రజలు వీడియో తీస్తున్నా ఏమాత్రం వెరపు లేకుండా వ్యవహారాన్ని చక్కబెట్టుకున్నాడు. రేషన్ డాన్, అతడి అనుచర మాఫియా (మిగతా 6వ పేజీలో)

అప్పుడు.. ఇప్పుడు అతడే

గత ప్రభుత్వ హయాంలో గుంటూరు నగరంలో అనిల్ అనే వ్యక్తి రేషన్ మాఫియా కార్యకలాపాలు కొనసాగించాడు. ప్రభుత్వం మారిన తర్వాత కూడా అతడే యథావిధిగా రేషన్ మాఫియా కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడనేది బహిరంగ రహస్యం. ఎండీయూలు నడపడం, అక్రమాలు చేయడంలో అను భవం పొందిన ఇతడు తన అనుచరులతో డీలర్ల వ్యవస్థకు సమాం తరంగా డోర్ డెలివరీ వ్యవస్థను కొనసాగిస్తున్నాడు. వాహనాలు, సరుకులు ఏమీ లేకుండా, ఈ-పోస్ యంత్రాన్ని తీసుకుని కార్డుదారుల వద్దకు వెళ్లి వేలిముద్రలు వేయించుకుని, చేతిలో డబ్బులు పెట్టి వస్తున్నారు. వాటాలు తీసుకుని అధికారులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు అతడికి సహక రిస్తుండడం గమనార్హం.

షైనింగ్.. స్టార్స్‌గా ఎదగాలి

- పేద విద్యార్థుల కోసమే కార్యక్రమం
- అవార్డుల ప్రధానోత్సవంలో మంత్రి గొట్టిపాటి

నరసరావుపేట కల్చరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల భవిష్యత్ కోసం రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్‌స్టార్స్ కార్యక్రమం ప్రవేశపెట్టిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పదో తరగతి షైనింగ్‌స్టార్స్ ఇంటర్-2025 ప్రతిభా పురస్కార అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమాలు సోమవారం స్థానిక భువనచంద్ర టౌన్‌హాల్‌లో జరిగాయి. ఈ సందర్భంగా



పురస్కారాలు పొందిన విద్యార్థులతో మంత్రి గొట్టిపాటి, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ లావు, ఎమ్మెల్యే అరవిందబాబు

మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియెగం చేసుకుని ఉన్నతస్థానాలకు ఎదగాలన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ గురువులను మరిచిపోతే జీవితంలో ఎదగరన్నారు. తాను ప్రభుత్వ పాఠశాలలో చదివానని, ఇప్పటికి తాను చదువుకున్న పాఠశాల ఉందన్నారు. కలెక్టర్ అయినా విద్యాబుద్ధులు నేర్పిన వారిని తరచూ కలుస్తూ ఉంటానని, వారి ముందు విద్యార్థిగానే ఉంటానన్నారు. చెడు స్నేహాలకు, సోషల్ మీడియా ప్రభావానికి లోను కాకుండా కష్టపడి అనుకున్న లక్ష్యాన్ని విద్యార్థులు సాధించాలన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ జీవితంలో ఎదగడానికి మార్కులు మాత్రమే కొలమానం కాదని, ఎదిగేక్రమంలో ఎదురయ్యే అవరోధాలను అధిగమించే ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు ఉపదేశించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ చదువు ద్వారానే ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చన్నారు. తల్లిదండ్రులతో పాటు చదువు చెప్పిన ఉపాధ్యాయులను మరిచిపోకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీ రాష్ట్ర శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్స్ సాంస్కృతిక సంస్థ చైర్‌పర్సన్ చేరెడ్డి మంజులారెడ్డి, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్ గంగాధర్, ఆర్డీవో కె.మధులత, ఇంటర్ విద్యాశాఖాధికారి సుహాసిని, డీఈవో చంద్రకళ, సమగ్ర శిక్ష ఏపీసీ సుబ్బారావు, ప్రభుత్వ పరీక్షల అధికారి హుస్సేన్, ఉపవిద్యాశాఖాధికారులు ఏసుబాబు, మహబూబ్ సుభాని, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మిర్చియార్డులో ట్రేడింగ్ ప్రారంభం

- తొలి రోజు 27 వేలకు పైగా టిక్కీల రాక
- రూ.14,700 ధర పలికిన తేజ వెరైటీ మిర్చి

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం గుంటూరు మిర్చి యార్డులో క్రయవిక్రయాలు పునః ప్రారంభమయ్యాయి. ఆదివారం సాయంత్రం నుంచే టిక్కీల దిగుమతికి అనుమతించడంతో సోమవారం ఉద యానికి 27 వేల పైచిలుకు కమీషన్ దుకాణాలకు చేరా యి. ఎండ తీవ్రత తగ్గకపోయినా గతంలో ప్రకటించిన విధంగా సోమవారం ఉదయం 7 గంటలకు విక్రయా లను దిగుమతి వ్యాపారులు ప్రారంభించారు. రైతుల సమక్షంలో శాంపిల్స్‌ని షాపుల్లో ప్రదర్శించారు. ఎగుమతిదారులు వేలం కేంద్రాలను సందర్శించి కొనుగోళ్లు చేపట్టారు. ప్రధానంగా తేజ, 341 వెరైటీల ను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. తొలి రోజు అయినా 23 వేల టిక్కీల వరకు విక్ర యాలు జరిగాయి. మిర్చి వెరైటీని బట్టి రూ.9500 నుంచి రూ.14 వేల వరకు ధర లభించింది. విదేశాలకు ఎగుమతి జరిగే తేజ కు క్వింటా ధర రూ.14 వేల 700 వరకు లభించింది. మిర్చి తాలు కాయలకు రూ.4,500 నుంచి రూ.7 వేల వరకు ధర లభించింది. ఈ వారం అంతా కాస్త మందకొడిగానే కొనుగోళ్లు జరుగుతాయని, వచ్చే వారం నుంచి పెరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.



మిర్చియార్డులో ప్రారంభమైన మిర్చి కొనుగోళ్లు

12న సుపరిపాలన - స్వర్ణాంధ్ర

- వెలగపూడి సచివాలయం దగ్గర్లో కార్యక్రమం
- పాల్గొననున్న సీఎం చంద్రబాబునాయుడు

8

80.19 శాతం రేషన్ పంపిణీ

మూడు జిల్లాల్లో 13.19 లక్షల కార్డులకు..

8

మార్కెటింగ్‌లో బది'లీలలు'

- కౌన్సెలింగ్ సందర్భంలో ఒక జాబితా రూపకల్పన
- చివరికి నలుగురిని మినహాయించి విడుదల

తలసరి ఆదాయం పెంచేందుకు కృషి

సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి గొట్టిపాటి

స్వర్ణాంధ్ర విజన్-2047 యాక్షన్‌ప్లాన్ యూనిట్ల ప్రారంభం

నరసరావుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చే మూడేళ్లలో తలసరి ఆదాయం రెట్టింపు చేయడానికి కృషి చేస్తామని ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రణాళిక క్షేత్రస్థాయి యాక్షన్‌ప్లాన్ యూనిట్లను రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ ఏకీకృత వ్యవస్థ ద్వారా ఒకే లక్ష్యంతో సమగ్ర అబివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేస్తారని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, టీడీపీ పార్లమెంటరీ నేత ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, జాయింట్ కలెక్టర్ సూరజ్‌ధనుంజయ్, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా సర్వేలన్నీ పూర్తి చేయాలి

గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేలు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవానం సాయంత్రానికి యోగాంధ్ర-1 సర్వే పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి ఆధార్ అప్‌డేట్ సర్వే పూర్తి చేయాలన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించండి

అధికారులను ఆదేశించిన ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితులు 51 మంది ఫిర్యాదులు అందజేశారు. ఆయా ఫిర్యాదులను ఎస్పీ స్వయంగా స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యపై శ్రద్ధతో నిర్ణీత గడువులోగా పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు.



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

శిక్ష పడితేనే నోళ్లు మూతపడతాయి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కొమ్మినేని, కృష్ణంరాజుకు శిక్ష పడితేనే పేటీఎం బృందం నోళ్లు మూతపడతాయని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ మీడియా చానల్‌లో జర్నలిస్ట్ కృష్ణంరాజు వ్యాఖ్యలపై జగన్ స్పందించకపోవడం సిగ్గుచేటని తెలిపారు. లక్షల మంది చూస్తున్నారనే కనీస స్పృహ లేకుండా చానల్ చర్చా వేదికలో రాజధాని అమరావతిని, ఆ ప్రాంత మహిళల్ని తూలనాడటం సహించరాని నేరమన్నారు. కొమ్మినేని అరెస్ట్ జగన్‌కు అప్రజాస్వామికంగా, చట్టవిరుద్ధంగా కనిపించడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

వారే నిజమైన సంకర జాతి



మాట్లాడుతున్న కొమ్మాలపాటి శ్రీధర్

అమరావతి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నకిలీ మద్యం అమ్మకాల ద్వారా కోట్లాది రూపాయల అవినీతి చేసి, పేదల ప్రాణాలు హరించిన వారే అసలైన సంకర జాతి అని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యలయంలో నాయకులతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లిక్కర్ కుంభకోణంపై రాష్ట్రంలో జరుగుతున్న చర్చను మరల్చడానికి వైసీపీ చేస్తున్న కుట్రలో బాగమే అమరావతిపై బురదజల్లడమన్నారు. అమరావతి రాజధానిని వేశ్యల రాజధాని అన్న మాటలకు పశ్చాతాపం పడకుండా వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి సంకరజాతి అన్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. సంకరజాతి అంటే దళితలను శిరోముండనం చేసినవారు, మాస్కులు అడిగితే డాక్టర్‌ను పిచ్చివాడిని చేసి చంపించినవారు, ఇసుక, మద్యం ద్వారా అవినీతికి పాల్పడిన వారు, ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన వారు అని పేర్కొన్నారు. రాజధాని మహిళలల మనోభావాలు దెబ్బతినేలా టీవీ డిబేట్‌లలో చర్చలు జరిపిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజును కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శ్రీధర్ కోరారు.

డ్రెయినేజీనే ఆక్రమించేశాడయ్యా...



బాపట్ల మండలంలోని అడవిపల్లెపాలెం వద్ద ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ డ్రైన్ పూడ్చి వేస్తున్న దృశ్యం

బాపట్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సముద్రంలోకి పడవలు తీసుకెళ్లే డ్రెయినేజీని పూడ్చేసి, నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని తీర ప్రాంత గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. డ్రెయినేజీల నుండి సముద్రంలోకి పడవలు వెళ్లడానికి ఆటంకం ఏర్పడిందంటూ మత్స్యకారులు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే బాపట్ల మండలం అడవి గ్రామ పంచాయతీ పరిధిలోని అడవిపల్లెపాలెం, కృపానగర్, దాన్వాయ్‌పేట, గాదె వెంకటరెడ్డి కాలనీ, రామాపురం, కనకదుర్గా నగర్, చీరాల మండలం వాడరేవు పంచాయతీలోని వాడరేవు ప్రాంతాల్లోని మత్స్యకారులు చేపల వేటకు వినియోగించే బోట్‌లను ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ డ్రెయిన్‌లో నిలుపుతారు. బోట్ల మరమ్మతులకు కూడా ఆప్రాంతం అనుకూలంగా ఉంటుంది. ఏడాది నుంచి ఆప్రాంతంలో ఆక్వా చెరువుల రైతు వెంకట్రావు కన్ను డ్రెయినేజీపై పడింది. ఒంపుగా ఉన్న డ్రెయిన్‌ను స్ట్రయిట్‌గా చేస్తానంటూ ఓ వైపు మొత్తం రాళ్లు, మట్టితో పూడ్చి సుమారు 7 ఎకరాలు ఆక్రమించాడు. పక్కనే రిసార్ట్‌లు కట్టాడని మత్స్యకారులు ఆరోపించారు. ఈవిధంగా డ్రెయినేజీని కబ్జా చేయడం వల్ల కాల్వ ద్వారా సముద్రంలోకి పడవలు వెళ్లడానికి వెడల్పు చాలదంటూ ఏడు గ్రామాలకు చెందిన 2 వేల బోట్‌లలో చేపల వేట చేసే మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమిత ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్న సదరు వ్యక్తిపై చర్యలు తీసుకొని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు ఎరిపిల్లి రమణ, పిక్కి డేవిడ్, పిక్కి సూరిరావు, దోనే శ్రీను, సిరిపిల్లి జగ్గారావు, చొక్కా రాంబాబు, చోడిపిల్లియాకోబు, దోనే కనకారావు ఉన్నారు.

- మా పడవలు సముద్రంలోకి వెళ్లేదెలా..



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అడవిపల్లెపాలెం, కృపానగర్, దాన్వాయ్‌పేట, గాదె వెంకటరెడ్డి కాలనీ తదితర గ్రామాలకు చెందిన మత్స్యకారులు

అనుమానపు అగ్ని కాల్చేసింది

- భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించిన భర్త

బాపట్లరూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానం పెంచుకున్న భర్త.. ఆమెపై ఇంటిలోనే పెట్రోల్ పోసి నిప్పటించాడు. ఇద్దరు చిన్న పిల్లలు తల్లి లేని అనాథలవుతారన్న కనికరం కూడా లేకుండా తలుపులు వేసి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ విషాద ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... బాపట్ల మండలం చెరువుజమ్ములపాలెం ఎస్సీ కాలనీకి చెందిన డీ సుభాషిణి (25)ని అదే గ్రామానికి చెందిన దోసరి హరీష్ 2014లో పెళ్లి చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో అతను కొంతకాలం నుండి భార్య మీద అనుమానం పెంచుకున్నాడు... వారి మధ్య అప్పుడప్పుడు గొడవలు జరుగుతుండేవి. మధ్యాహ్నం గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకులో హరీష్ రెండు లీటర్ల పెట్రోల్ కొనుగోలు చేసి, ఇంట్లో ఉన్న భార్య సుభాషిణిపై పోసి నిప్పు అంటించాడు. తలుపులు వేసి అక్కడి నుంచి పారిపోయాడు. అటుగా వెళ్తున్న గ్రామస్థులు సుభాషిణి కేకలు విని, ఆమెను బయటకు తీసుకొచ్చి మంటలు ఆర్పారు. వెంటనే బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే 80 శాతం వరకు సుభాషిణి శరీరం కాలిపోయిందని వైద్యులు నిర్ధారించి, మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలికి ఇద్దరు చిన్న పిల్లలు ఉండటంతో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. హరీష్‌పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపడుతున్నారు.



డీ సుభాషిణి (ఫైల్‌ఫొటో)

రేషన్ మాఫియా.. బరితెగింపు

(5వ పేజీ తరువాయి)

సభ్యులు ఇంతలా బరితెగించి చెలరేగిపోతున్నా, పత్రికల్లో పుంఖానుపుంఖాలుగా కథనాలు వస్తున్నా పౌర సరఫరాల అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అక్రమాలకు కొన్ని ఉదాహరణలు..

- గుంటూరు సాయికృష్ణనగర్‌లోని డీలర్ రాజీనామాతో డాన్ అధికారులతో మాట్లాడి ఆ షాపునకు డానియేలు అనే అతణ్ణి ఇన్‌చార్జిగా నియమించేలా చేసుకుని వ్యవహారాన్ని నడిపిస్తున్నాడు.
- ❑ గుంటూరు -1 పరిధిలో ఉన్న షాపునకు సంబంధించిన ఈ-పోస్ యంత్రాన్ని తెచ్చి గుంటూరు-2 పరిధిలో వేలిముద్రలు వేయించుకుంటున్నారు.
- ❑ భరత్‌పేటలో గుంటూరు-వన్‌కు చెందిన మాఫియా అనుచరులు వేలిముద్రల తతంగాన్ని బహిరంగంగానే నడిపిస్తున్నారు.

వైసీపీ నాయకుడే.. ఇన్‌చార్జి డీలర్

దుకాణం నల్లచెరువులో.. వేలిముద్రలు పలకలూరు రోడ్డులో

గుంటూరు: కూటమి ప్రభుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల సంగతేమోగాని వైసీపీ శ్రేణులకు మాత్రం అన్ని పనులు జరిగిపోతున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కాకుండా ప్రభుత్వం మారిన తర్వాత కూడా కూటమిపై బహిరంగంగా విమర్శలు, నిరసనలు చేపట్టిన వారికి ఏకంగా ఇన్చార్జి డీలర్‌షిప్ కట్టబెట్టారు. గుంటూరులోని పలకలూరురోడ్డు కృష్ణబాబుకాలనీకి చెందిన వైసీపీ నాయకుడికి గతంలో ఎండీయూ వాహనాన్ని కేటాయించారు. అతడు వాహనాల ఆపరేటర్ల నుంచి పెద్దమొత్తంలో బియ్యాన్ని కొనుగోలు చేసి లక్షలు పోగేసుకున్నాడనేది బహిరంగ రహస్యం. ఎండీయూ వాహనాల రద్దును వ్యతిరేకిస్తూ గత నెల 23న స్తంభాలగరువు సెంటర్లో ధర్నా, రాస్తారోకో చేశాడు. నల్లచెరువులోని 145 నెంబరు డీలర్ రాజీనామాతో అక్కడ ఇన్‌చార్జిగా పలకలూరురోడ్డు ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడ్ని నియమించారు. అతడు అక్కడ సరుకులు పంపిణీ చేయకుండా బియ్యానికి నగదు పంపిణీ చేస్తున్నాడు. ఆ బియ్యాన్ని మాఫియా డాన్‌కు తరలిస్తున్నాడు. ఎక్కడో నల్లచెరువు ప్రాంతానికి చెందిన ఈ-పోస్ యంత్రంతో పలకలూరు రోడ్డులోని కార్డుదారులతో వేలిముద్రలు వేయిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. కార్డుదారులు ఎక్కడైనా రేషన్ తీసుకునే సౌలభ్యం ప్రభుత్వం కల్పించగా దాని ఆధారంగా అక్రమ దందాను కొనసాగిస్తున్నట్లు తోటి డీలర్లు వాపోతున్నారు.

స్కూటీని ఢీకొన్న లారీ.. మహిళ మృతి

మేడికొండూరు జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న స్కూటీని వేగంగా లారీ ఢీకొట్టడంతో.. మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. స్కూటీ నడుపుతున్న వ్యక్తికి గాయాలు అయ్యాయి. పేరేచర్ల సమీపంలో నల్లపాడు శ్రీనివాస్ నగర్ కాలనీ వద్ద సోమవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. గుంటూరు నగరం స్తంభాలగరువుకు చెందిన చల్లా సాంబిరెడ్డి తన ఇంటి సమీపంలోని కోటేశ్వరమ్మ(55) అనే మహిళతో కలసి కైలాసగిరి క్షేత్రానికి వెళ్లి దైవదర్శనం అనంతరం తిరిగి వస్తున్నాడు. శ్రీనివాస నగర్ కాలనీ వద్ద వెనకనుంచి లారీ వీరు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొంది. వెనకవైపు కూర్చుని ఉన్న కోటేశ్వరమ్మ లారీ టైర్ల కింద పడి అక్కడికక్కడే మరణించింది. స్కూటీ నడుపుతున్న సాంబిరెడ్డికి స్వల్ప గాయాలు అయ్యాయి. నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన స్థలం గుంటూరు, మేడికొండూరు మండలాల సరిహద్దు కావడంతో ముందుగా అక్కడకు చేరుకున్న మేడికొండూరు పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వ్యవసాయ, ఖజానా శాఖల్లో బదిలీలు

గుంటూరు సిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ జోన్-3 పరిధిలోని 23 మంది సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లను బదిలీ చేస్తూ కమిషనర్ ఢిల్లీరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన వారు ఉన్నారు. నెల్లూరు జిల్లాలో పని చేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ రోజామణిని గుంటూరుకు.. గుంటూరు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎన్‌వీ ప్రసాద్‌ను నెల్లూరుకు బదిలీ చేశారు.

ఖజానా శాఖలో..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఖజానా శాఖలో బదిలీల సందడి నెలకొంది. 67 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారు. వీరిలో సీనియర్ అకౌంటెంట్లు, జూనియర్ అసిస్టెంట్‌లు, గ్రూప్-4, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఇదిలా ఉంటే నిబంధనల ప్రకారం 9 ఏళ్ల స్టేషన్ సర్వీస్ పూర్తి కానప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషాను కూడా బదిలీ చేయడం చర్చ నీయాంశంగా మారింది.

అనుమానాస్పద స్థితిలో యాచకుడి మృతి



తెనాలి, మారీసుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారీసుపేట లోయర్ వార్ఫ్‌లో సోమవారం తెల్లవారుజామున అనుమానాస్పద స్థితిలో యాచకుడు మృతి చెందాడు. అతనిది హత్య లేక ఆత్మహత్య అనే సందేహాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. త్రీటౌన్ ఎస్సై షేక్ కరిముల్లా కథనం మేరకు.. పట్టణంలో యాచక వృత్తి చేసుకుంటు జీవించే వృద్ధుడు (65) సోమవారం తెల్లవారుజామున మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మెడకు కండువా ముడిపెట్టి ఉన్న వృద్ధుడి మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురికి తరలించారు. యాచకుడి మృతిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ ఎస్సై కరిముల్లా తెలిపారు.

క్వాలిటీ కుట్ర..

(5వ పేజీ తరువాయి)

రూ.8,500 ధర ఇవ్వడానికి కూడా సుముఖత చూపని కంపెనీలు ఇప్పుడు రూ.10,000 ఇస్తామని క్వాలిటీ పొగాకు మొత్తాన్ని లాగేసే పనిలో ఉన్నట్లు సమాచారం. మార్క్‌ఫెడ్ పూర్తి స్థాయిలో రంగంలోకి దిగడానికి రెండు మూడు రోజులు సమయం పట్టే అవకాశం ఉండడంతో ఈలోపులోనే క్వాలిటీ బర్లీని మొత్తం తమ హస్తగతం చేసుకునేలా కంపెనీలు పావులు కదుపుతున్నాయి. అంతర్జాతీయంగా పొగాకు మార్కెట్ తీవ్ర ఒడిదుడుకుల్లో ఉందని చెబుతూ వస్తున్న కంపెనీలు మార్క్‌ఫెడ్ ప్రకటన రాగానే క్వాలిటీ పొగాకు కోసం గ్రామాల్లో జల్లెడ పట్టడాన్ని రైతులు తప్పుబడుతున్నారు. క్వాలిటీలో అయితే లాభాలు గడించే అవకాశం ఉండడంతో లోగ్రేడ్ రకాలను పూర్తిగా విస్మరించి వారి ప్రయోజనాలే పరమావధిగా కంపెనీల అడుగులు ఉండడంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రూ.12,000 వరకు క్వాలిటీ పొగాకుకు మార్క్‌ఫెడ్ ధర ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ ఆశతోనే రైతులు తాము మార్క్‌ఫెడ్‌కే అమ్ముకుంటామని ఏజెంట్లకు తెగేసి చెబుతున్నట్లు సమాచారం. బాపట్ల జిల్లాలో 3 లక్షలు, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో దాదాపు 1.60 లక్షల క్వింటాళ్ల వరకు బర్లీ పొగాకు ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఇందులో దాదాపు 50 శాతం క్వాలిటీ గ్రేడ్ రకం కాగా మిగిలినది మీడియం, లో క్వాలిటీగా ఉంది.

గృహనిర్మాణ సంస్థలో పది మంది డీఈఈలకు ఉద్యోగోన్నతులు

అమరావతి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో పది మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు ఉద్యోగోన్నతులు లభించాయి. వారికి అందుబాటులో ఉన్న ఖాళీల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉద్యోగోన్నతులు పొందినవారిలో జి.పిచ్చయ్య (కందుకూరు డివిజన్, నెల్లూరు జిల్లా), పి.వెంకటరావు (మార్కాపురం డివిజన్, ప్రకాశం జిల్లా), కె.రమేష్‌రెడ్డి (మదనపల్లి డివిజన్, అన్నమయ్య జిల్లా), ఎన్.సుబ్రహ్మణ్యం (ప్రొద్దుటూరు డివిజన్, (కడప జిల్లా), వై.లక్ష్మీనారాయణమ్మ (ధర్మవరం డివిజన్, శ్రీ సత్యసాయి జిల్లా), బి.వెంకటరమణ (పెనుగొండ డివిజన్, సత్యసాయి జిల్లా), కె.సూరిబాబు (టెక్కలి డివిజన్, శ్రీకాకుళం జిల్లా), ఎం.రామోజీ నాయక్ (శ్రీకాకుళం డివిజన్, (పార్వతీపురం మన్యం జిల్లా), కె.చంద్రశేఖర్ (పాలకొండ డివిజన్, పార్వతీపురం మన్యం జిల్లా), కె.వి.వి.ఎస్.ప్రసాద్ (జంగారెడ్డిగూడెం డివిజన్, ఏలూరు జిల్లా) ఉన్నారు.

వ్యర్థాల నిర్వహణలో నివేదిక సిద్ధం చేయాలి

జిందాల్ ప్లాంట్‌పరిశీలనలో పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి



జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరి సురేష్ కుమార్, సీడీఎం సంపత్ కుమార్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సీఎం పర్యటన నేపథ్యంలో ప్లాంట్ కెపాసిటీ, వస్తున్న వ్యర్థాలు, పంపుతున్న మునిసిపాలిటీలు, రోజువారీ విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, వ్యర్థాల నిర్వహణ వంటి సమగ్ర వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రటరి సురేష్‌కుమార్ చెప్పారు. గుంటూరు సమీపంలోని నాయుడుపేట వద్ద గల జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ని ఆయన సోమవారం సందర్శించారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ పరిశీలనకు రానున్న తరుణంలో సీడీఎంఏ డాక్టర్ సంపత్ కుమార్, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులతో కలిసి ప్లాంట్‌ని పరిశీలించారు. ప్లాంట్ సామర్థ్యం, పనితీరు, చెత్త సేకరణ, విద్యుత్ ఉత్పత్తి తదితర వివరాలను జిందాల్ ఏపీ ప్రాజెక్ట్ ప్రెసిడెంట్ ఎంవీ చారి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అలాగే జీఎంసీ నుండి చేపట్టాల్సిన పారిశుధ్య పనులకు పిన్ పాయింట్‌గా సిబ్బందిని కేటాయించాలని కమిషనర్‌ని ఆదేశించారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఉపా సెల్ పీఓ రామారావు పాల్గొన్నారు.

కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శిగా శ్రీనివాస్‌కు ఉద్యోగోన్నతి



గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ లీగల్ సర్వీస్ అధికారి రామి శెట్టి శ్రీనివాస్‌కు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖలో అదనపు కార్యదర్శిగా ఉద్యోగో న్నతి లభించింది. ఈ మేరకు కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ అధికారికంగా జారీ చేసిన ఉత్తర్వులు ఆయనకు సోమవారం అందాయి. ఈ నియామకానికి సంబంధించిన గజిట్ నోటిఫికేషన్‌ని కూడా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. రామిశెట్టి శ్రీనివాస్ యూపీఎస్‌సీ ద్వారా ఇండియన్ లీగల్ సర్వీస్‌కు ఎంపికై విధులు నిర్వహిస్తున్నారు. జాయింట్ సెక్రెటరీ హోదాలో ఆయన నూతన చట్టాల రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. జీఎస్‌టీ, రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ యాక్టు, పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్, సరోగసి బిల్లు, పలు రాజ్యాంగ సవరణల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆయన గుంటూరు జిల్లాలో పుట్టారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో విద్యాభ్యాసం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా అంకారావు



కారంపూడి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో సలహాదారుడిని నియమించింది. కారంపూడి పట్టణానికి చెందిన కొమెర అంకారావు అలియాస్ జాజిని అడవుల పెంపకం సలహాదారునిగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లమల అడవిలో ప్లాస్టిక్ ఏరివేత ఒక యజ్ఞంలా నిర్వహించిన చరిత్ర జాజికి ఉంది. ఇటీవల పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వన మహోత్సవం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు అంకారావును ప్రభుత్వ సలహాదారునిగా నియమిస్తున్నట్లు ప్రకటన చేశారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

నూజెండ్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తజెడ్డావారిపాలెంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కట్టెంపూడి సువార్తమ్మ(57) ఇంటి వద్ద మోటారు స్విచ్ వేసే సమయంలో విదుత్‌షాక్‌కు గురై మృతి చెందింది. ఆదివారం రాత్రి వర్షం పడటంతో స్విచ్ బోర్డుకు కరెంటు సరఫరా అయ్యి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనా స్థలాన్ని ఐనవోలు ఎస్ఐ టీవీ కృష్ణారావు పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సువార్తమ్మకు భర్త సుదర్శన్, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

22,873 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 27,034 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 22,873 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 4161 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9500	13500	334	9500	14000
నెంబరు. 5	10000	12500	నెంబరు. 5	10000	13500
273	10000	12500	273	---	---
341	10000	13500	341	10000	14500
4884	--	--	4884	--	--
సూపర్ 10	10000	12500	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	14700
బ్యాడిగి	10000	13000	బ్యాడిగి	10000	13500
దేవనూరు డీలక్స్	10000	12500	దేవనూరు డీలక్స్	10000	13800
ఆర్మూరు	9800	11200	తెల్లకాయలు	4500	7000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఏడుగురు జూదరుల అరెస్టు.. రూ.67,200 స్వాధీనం

రెంటచింతల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని జాతీయ రహదారిలో ఓ లాడ్జిలో జూదమాడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారినుంచి రూ.67,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఇస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ భరోసా నిచ్చారు.

నదీతీరంలో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



నదీ తీరంలో పోలీసులు ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డులు

అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అమరేశ్వరాలయం సమీపంలో కృష్ణానది వద్ద వరుసగా జరుగుతున్న ప్రమాదాల నివారణకు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పోలీసులు ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశారు. ఆలయ అధికారులు ఏర్పాటుచేసిన స్నానఘాట్‌ల వద్ద స్నానాలు ఆచరించాలని, నది లోపలికి వెళ్లవద్దని గతంలో జరిగిన ప్రమాదాల తాలూకు ఫొటోలతో సైన్‌బోర్డులను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సీఐ అచ్చియ్య, ఎస్ఐలు అమీర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు పద్మావతీ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి తిరునాళ్ళ

ముప్పాళ్ళ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మాలపాడు పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి తిరునాళ్ళ మంగళవారం జరుగుతుందని సోమవారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గర్భిణులకు అన్నప్రసాదం అందజేత

కారంపూడి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం పీఎంఎస్ఎంఏ కార్యక్రమానికి విచ్చేసిన గర్భిణులకు శ్రీ వాసవీ సేవా అన్నప్రసాద కమిటీ ఆధ్వర్యాన అన్నప్రసాదం అందజేశారు. శాశ్వత దాత వెలుగూరు శేషారావు, భారతి దంపతులు ఈ సేవా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సుమారు 200మందికి అన్నప్రసాదం అందించారు. గంధం మెహర్‌కుమార్, మేనక దంపతులు, వెలుగూరి అశోక్, శ్వేత దంపతులు సహకారం అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.శ్రీనివాసరెడ్డి, ఈవో కసిన్యానాయక్, ఉప ఎంపీపీ గాడిపర్తి రమాదేవి, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ కూరాకుల సుబ్బారావు, జనసేన నేత పాలెపోగు బాబు, భవిరిశెట్టి రామారావు, చిన్నిలక్ష్మి, మాడిశెట్టి పుష్పలత, భవిరిశెట్టి సీతామహాలక్ష్మి, చింతల శారద, చిన్ని అనంతలక్ష్మి, పల్లా పద్మ, చింతా సుశీల, రేణుక, వైద్యులు రమ్య, లక్ష్మీమౌనిక, సీహెచ్‌వో మల్లయ్య, హెచ్‌వీ వెంకటమణి, హెల్త్ అసిస్టెంట్ లాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.



కేసానుపల్లి సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న చెట్టిపోగు వెంకమ్మ, పక్కన టీడీపీ నేతలు

కేసానుపల్లి గ్రామ సర్పంచ్‌గా వెంకమ్మ ప్రమాణ స్వీకారం

దాచేపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామ సర్పంచ్‌గా దళిత మహిళ చెట్టిపోగు వెంకమ్మ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటివరకు ఉపసర్పంచ్‌గా ఉన్న వెంకమ్మ ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా బాధ్యతలు తీసుకున్నారు. గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని వెంకమ్మ వివరించారు. కార్యక్రమంలో చెట్టిపోగు ఏసుదానం, కోటయ్య, కోట శాయన్న, షేక్ జానయ్య, శ్రీపతి లింగయ్య, మీసాల ఎర్మియా, చెట్టిపోగు ఏసయ్య, నెల్లూరి రామకోటయ్య, పంచాయతీ కార్యదర్శి కే స్వామినాయక్, బొల్లా కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ లావును కలసిన కన్నా



సత్తెనపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో కలిశారు. సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధికి పలు కీలక అంశాలపై ఎంపీతో కన్నా చర్చించారు.

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నా

ఘనంగా శివాజీ పట్టాభిషేక వార్షికోత్సవం

క్రోసూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహరాజ్ పట్టాభిషేక మహోత్సవం సోమవారం క్రోసూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. హిందూ సామ్రాజ్య దివస్‌గా ఈ కార్యక్రమాన్ని జరిపారు. మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో క్రోసూరు యూత్ నాయకులు వడ్లమూడి బాలకృష్ణ, అశోక్ బాబు, నరసింహారావు, కోటేశ్వరరావు, శంకర్, ఏడుకొండలు, మణికంఠ, జనార్ధనరావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గోడ కూలి ఆరు గేదెలు మృతి

పిడుగురాళ్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గుత్తికొండ గ్రామానికి చెందిన జిలుగు రామారావు, పోలురాజుకు చెందిన ఆరు గేదెలు మృతి చెందాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి గోడ నాని కూలిపోవడంతో రామారావు, పోలురాజులకు చెందిన ఆరు గేదెలు మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.2.5లక్షలు వుంటుందని బాధితులు తెలిపారు. రెవెన్యూ, పశువైద్య సిబ్బంది సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.



గుత్తికొండలో గోడ కూలి మృతి చెందిన గేదెలు

వీధి వ్యాపారులపై సర్వే

● ఆర్థికంగా వీధి వ్యాపారుల బలోపేతమే లక్ష్యంగా..



వీధి వ్యాపారులపై సర్వే నిర్వహిస్తున్న మెప్మా సచివాలయ సిబ్బంది

సత్తెనపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీధి వ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేసి వడ్డీ వ్యాపారుల నుంచి కాపాడేందుకు మరోసారి సర్వే కొనసాగుతోంది. 2017లో సర్వే పూర్తిచేసి వ్యాపారులకు పీఎం స్వానిధి ద్వారా మెప్మా అధికారులు రుణాలు మంజూరుచేయించారు. ఇటీవల హైకోర్టు మరోసారి వీధి వ్యాపారులను సర్వే చేయాలని ఆదేశించటంతో రాష్ట్ర వ్యాప్త సర్వేలో భాగంగా సత్తెనపల్లిలో వీధి వ్యాపారుల సర్వే జరుగుతోంది.

వెండర్ కనెక్ట్ యాప్ ద్వారా ..

ప్రస్తుతం సర్వే వెండర్ కనెక్ట్ యాప్ ద్వారా సచివాలయ ఉద్యోగి, మెప్మా సిబ్బంది నిర్వహిస్తున్నారు. గతంలో మెప్మా సిబ్బంది మాత్రమే పట్టణంలోని వీధి వ్యాపారులను గుర్తించి నమోదు చేశారు. ఈ సారి వీరితో పాటు సచివాలయ అడ్మిన్‌లను కూడా సర్వేలో భాగస్వాములను చేశారు. పట్టణంలో ఆయా వార్డుల సచివాలయ ఉద్యోగులు, మెప్మా సిబ్బంది సర్వే చేస్తున్నారు. గతంలో చేపట్టిన సర్వేలో నమోదైన వీధి వ్యాపారులతో పాటు పీఎం స్వానిధి రుణాలు తీసుకోని సర్వేలో నమోదు కాని వారిని గుర్తిస్తున్నారు. ఈ విషయంపై మునిసిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ సర్వే నిర్వహించి వీధి వ్యాపారులను గుర్తిస్తున్నామన్నారు. సర్వేలో నమోదైన వీధి వ్యాపారులకు మునిసిపాలిటీ ద్వారా గుర్తింపు కార్డు, సర్టిఫికెట్ అందిస్తామన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చూస్తామన్నారు. సత్తెనపల్లి పట్టణంలో ఇప్పటివరకు 232 మందిని సర్వే చేయగా 98 మందికి గుర్తింపు కార్డులు ఇచ్చినట్టు ఆయన తెలిపారు.



వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, అధికారులు

వర్చువల్ కార్యాలయాల ప్రారంభం

సత్తెనపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం స్వర్ణాంధ్ర విజన్ వర్చువల్ కార్యాలయాలను ప్రారంభించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, మునిసిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు నిబద్ధతతో పని చేయాలి



నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి నియోజకవర్గంలో కొత్తగా నియమితులైన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నిబద్ధతతో పనిచేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో సోమవారం నియోజకవర్గంలో నూతనంగా అంగన్‌వాడీ, ఆయాలుగా నియమితులైన 17మందికి, కార్యకర్తలుగా నియమితులైన ఇద్దరికి కన్నా నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన అంగన్‌వాడీ కేంద్రాలకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆళ్ళ అమరేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు, బత్తుల నాగేశ్వరరావు, కోమటినేని శోభారాణి, మస్తాన్‌వలి, ఆళ్ళ సాంబయ్య, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డుల ప్రదానం

దాచేపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో జరిగిన షైనింగ్ స్టార్-2025 ప్రతిభా అవార్డులు సాధించిన దాచేపల్లి మండలంలోని కేసానుపల్లి గ్రామానికి చెందిన గీతాగురుకులం విద్యార్థులు ప్రతిభా అవార్డులను అందుకున్నారు. సోమవారం నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందుకున్న విద్యార్థులు తిరుమలశెట్టి కోమలి, బత్తుల అమూల్య, అనంత వైష్ణవిలను మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అరవింద బాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, డీఈవో చంద్రకళ, ఎంఈవో పినాకిని పాణి, పాఠశాల కరస్పాండెంట్ అనిశెట్టి సాంబశివరావు అభినందించారు.

● నకరికల్లు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన నకరికల్లు మండలం కుంకలగుంట జడ్పీ హైస్కూల్‌కు చెందిన గంజనబోయిన రాధిక, చెన్నం శ్రీనాగమణి, ఊసా గీతాంజలి, జెట్టి రూపలకు నరసరావుపేటలో కలెక్టర్ పీ అరుణ్‌బాబు సర్టిఫికెట్, మెడల్, రూ.20వేల నగదు బహుమతిని అందజేశారు.

● క్రోసూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నుంచి క్రోసూరుకు చెందిన నలుగురు విద్యార్థులు షైన్ అవార్డులు స్వీకరించారు. అవార్డులు అందుకున్న విద్యార్థుల్లో క్రోసూరు ప్రభుత్వ మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి జీ నరేష్, పదో తరగతి తరగతి విద్యార్థి కుంభా భానుతేజ ఉన్నారు.

● పెదకూరపాడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): షైనింగ్ స్టార్ అవార్డులను ఆరుగురు విద్యార్థులు అందుకున్నట్లు ఎంఈవో ఏకుల ప్రసాదరావు సోమవారం తెలిపారు. పెదకూరపాడులోని చేగు మోహన వెంకటహర్షిత, ఎదుళ్ళపల్లి వెంకట శివకుమార్, గుంటూరు అమూల్య, పులి సంతోష్‌పాల్, చిన్నిశెట్టి సుమశ్రీలు అందుకున్నారన్నారు.

● రెంటచింతల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రెంటచింతల మండలానికి చెందిన ఏడుగురు విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులను అందించారు.



ఎంపీ లావు, కలెక్టర్ అరుణ్‌బాబు నుంచి అవార్డు అందుకుంటున్న రెంటచింతల విద్యార్థులు



నకరికల్లు: కలెక్టర్ అరుణ్‌కుమార్, మంజులారెడ్డి నుంచి అవార్డును అందుకుంటున్న గంజనబోయిన రాధిక

టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఫాతిమా విద్యానికేతన్‌కు చెందిన బి.గీతా అఖిల్‌రెడ్డి, ఎం.మల్లికార్జుననాయక్, సన్నెగంటి లాస్య, బొగ్గవరపు సువర్ణలక్ష్మి, అల్ఫోర్స్ స్కూల్‌కు చెందిన చింతమళ్ల శశాంక్, వివేకా పబ్లిక్‌స్కూల్ విద్యార్థి షేక్ యాసిన్, బాలవికాస్‌స్కూల్ విద్యార్థిని రాయ అనుష్కలు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో శిల్పారామం చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి, డీఈవో జి.సంధ్యారాణి, ఎంఈవో శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు షేక్ సమీరా, జంగాల హర్షితలు పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి షైనింగ్ స్టార్స్ అవార్డులను అందుకున్నారు. నరసరావుపేటలో కలెక్టర్ అరుణ్‌బాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

● దుర్గి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులేశునిపల్లె జడ్పీ హైస్కూల్‌కు చెందిన పల్లె దివ్య మల్లిక, గుమ్మితి భవ్యశ్రీ, నవ్య, వైష్ణవి, శ్యామ్ షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్నారు. నరసరావుపేటలో ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, కలెక్టర్ అరుణ్‌బాబు నుంచి అవార్డులను అందుకున్నారు.

● గురజాలటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాని విద్యానికేతన్ విద్యార్థులు స్రవంతి, అమృతలు షైనిగ్ అవార్డులు అందుకున్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ అరుణ్ బాబుల నుంచి అవార్డులను అందుకున్నారు.

మేజర్ కాల్వల మరమ్మతులకు రూ.1.33 కోట్లు

● ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సాగునీటి మేజర్ల మరమ్మతులకు మాచర్ల నియోజకవర్గానికి రూ.2 కోట్లు కేటాయించగా అందులో రెంటచింతల మండలానికి రూ.1.33 కోట్ల నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మేజర్ల నిండా తూటికాడ, జమ్ము నిండి నీరుపారి పంటలు పండే అవకాశం లేకుండా పోయిందని విమర్శించారు. పాలువాయి మేజర్‌కు నాలుగు పనులకు రూ.28.05లక్షలు, రెంటచింతల మేజర్‌లో నాలుగు పనులకు రూ.36.72 లక్షలు, మల్లవరం మేజర్‌లో 11 పనులకు రూ.60 లక్షలు, గొట్టిముక్కల మేజర్‌కు రూ.8.5 లక్షలు కేటాయించారన్నారు. పది రోజుల్లో ఈ పనులు ఖచితంగా పూర్తి కావాల్సిందేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈయన వెంట డీసీ చైర్మన్ పోట్ల నరసింహారావు, కాలువ చైర్మన్ బెల్లంకొండ శ్రీనివాసరావు, లింగా పున్నారావు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, సర్పంచ్ మందలపు విజయలక్ష్మి, అల్లం బ్రహ్మారెడ్డి, సర్వేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, తుఫాన్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ టి.మురళీధర్, ఏఈ పి.సుధాకర్ తదితరులున్నారు.

ధ్రువీకరణ పత్రాలు లేకుంటే చర్యలు

● ఎస్ఐ సుధీర్‌కుమార్



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఎస్ఐ సుధీర్‌కుమార్

దుర్గి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుధీర్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలను తల్లిదండ్రులు ఇవ్వవద్దని, నంబరు ప్లేట్లు లేకుండా వాహనాలను నడపవద్దని సూచించారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలన్నారు. పెండింగ్ చలానాలను చెల్లించాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

శారీరక రుగ్మతలకు యోగా చక్కని పరిష్కారం

కారంపూడి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులు లక్ష్మీ మౌనిక, ఉదయలక్ష్మి ఆధ్వర్యాన సోమవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా వల్ల ప్రయోజనాలను వివరించి ర్యాలీ జరిపారు. యోగాతో వ్యాధులు దూరమవుతాయని, మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మల్లయ్య, సూపర్‌వైజర్ మణి, లాలానాయక్, మస్తాన్‌వలి, శివ, ఈశ్వరి, అ నూష, రమాదేవి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

● బెల్లంకొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): శారీరక రుగ్మతకు యోగా చక్కని పరిష్కారమని ఎంపీడీవో శ్రీనునాయక్ పేర్కొన్నారు. సోమవారం బెల్లంకొండలో యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ యోగా చేయటం వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి గ్రామంలో యోగా శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం బెల్లంకొండ మెయిన్ సెంటర్ నుంచి పోలీసుస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ గిరిధర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ వెంకటగిరిరెడ్డి పాల్గొన్నారు.

● మాచవరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ఎంపీడీవో వెంగళరావు సూచించారు. సోమవారం మాచవరంతో పాటు అన్ని గ్రామాల్లో యోగా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన జరగనున్న యోగా కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిరోజు ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో యోగాసనాలు, ర్యాలీలు సచివాలయ సిబ్బంది నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని ఆదేశించారు. ర్యాలీల్లో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, గున్నా శ్రీనివాసరావు, ఆర్ఐ కోటేశ్వరరావు, అన్ని గ్రామాల సచివాలయ సిబ్బంది, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కారంపూడిలో నిర్వహిస్తున్న యోగాంధ్ర ర్యాలీ



బెల్లంకొండలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో, అధికారులు

ఏరియా వైద్యశాలలో రక్తదాన శిబిరం

సత్తెనపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ విలియం కేరి మెమోరియల్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏరియా వైద్యశాలలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 30 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం సంస్థ సభ్యులు రోగులకు, సబ్‌జైలులో ఖైదీలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బంకా బాబూరావు, గుజ్జర్లపూడి భాను ప్రకాష్, గుజ్జర్లమూడి మనోజ్ కుమార్, బుల్లా అనీల్, గంధం లోకేశ్, గుజ్జర్లపూడి కృపాదానం, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, ఆర్ఎంవో కృష్ణమూర్తి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధా, హెడ్ నర్సు బంగారు పాప, సుభానీ, క్రాంతి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

13న జాబ్ మేళా

సత్తెనపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ పల్నాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నియోజకవర్గ స్థాయి జాబ్‌మేళా జరుగుతుందని నిర్వాహకులు రామకృష్ణారెడ్డి, అంజిరెడ్డిలు సోమవారం విలేకరులకు తెలిపారు. మేళాకు ప్రముఖ కంపెనీలు హాజరవుతాయన్నారు. ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, బీటెక్, డిప్లమో, ఫార్మసీ, పీజీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. హాజరయ్యేవారు తమ రెజ్యూమ్ సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్ ఫోర్టు ఫోటోలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 8074393466, 9494986164 నెంబరులో సంప్రదించాలన్నారు.

ప్రాంతీయ భాషలపై అవగాహన కలిగి ఉండాలి

సత్తెనపల్లి రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ భాషలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్‌గుప్తా అన్నారు. సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయంలో భారతీయ భాష సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ భాషల్లో ఒక్కటైన మలయాళం భాషకు ఈ విద్యా సంవత్సరంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వటం జరిగిందన్నారు. ఏడు రోజులపాటు జరిగిన ఈ క్యాంపులో 80 మంది విద్యారులు పాల్గొన్నారు.

మహిళలను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి

● సీపీఐ ఏరియా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

మాచర్ల రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతి ప్రాంత మహిళలను కించపరిచేలా మాట్లాడిన జగన్‌మీడియా జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, శ్రీనివాసరావులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకల శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రమంతా అమరావతిని దేవతల రాజధానిగా కొలుస్తుంటే ఆ ప్రాంత మహిళలను కించపరిచేలా మాట్లాడడం దుర్మార్గమన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు ..

సత్తెనపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావును తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో సోమవారం కలిసి టీడీపీ నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో సత్తెనపల్లి టీడీపీ నేతలు అంకాళ్ళ ప్రభుదాసు, శనగపూల నరసింహారావు, వెంకయ్య తదితరులు ఉన్నారు.



పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో-2 సురేష్

పాఠ్య పుస్తకాల పంపిణీ

మాచర్లటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన పాఠ్యపుస్తకాలను సోమవారం ఎంఈవో - 2 అల్లి సురేష్ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందించారు. పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గల పంపిణీ కేంద్రంలో ఈ పాఠ్య పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 47 వేల పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయన్నారు. విద్యార్థులకు సరిపడా పాఠ్య పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. బ్యాగులు, బూట్లు, యూనిఫామ్‌లు అందాల్సి ఉందన్నారు.

బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

రెంటచింతల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలో సోమవారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని బి.నాగిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నేత పాశం మట్టారెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేసి ప్రధానమంత్రి మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నాసరయ్య, కె.భిక్షమాచారి, సురేష్‌బాబు, విజయ్‌కుమార్, కొత్త రాజేశ్వరరావు, సురేష్‌బాబు, ఎం.విజయసారధి, పెనుగొండ కుమార్, చిన్నహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 21.27 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

స్వర్ణాంధ్ర విజన్ కార్యాచరణ అమలుకు ముందడుగు

పెదకూరపాడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యాచరణ ప్రణాళిక అమలుకు ప్రభుత్వం ముందడుగు వేస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను సాధించేందుకు ప్రతి నియోజకవర్గంలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపును అనుసరిస్తూ పెదకూరపాడు నియోజకవర్గంలో కార్యాచరణ మొదలైనట్టు ఎమ్మెల్యే ప్రవీణ్ సోమవారం తెలిపారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అంశాలను ప్రస్తావించారు. మండలాల్లో స్థానిక పరిస్థితులపై ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని వివరించారు. ప్రజల అవసరాలు, క్షేత్రస్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు పొందించి వాటిని అమలు చేస్తామన్నారు. చంద్రబాబు సూచనలు మార్గదర్శకంగా ఉపయోగ పడతాయన్నారు.

సజ్జలపై కేసు నమోదు చేయాలి

పెదకూరపాడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని మహిళలను ఘోరంగా అవమానించిన వారి గురించి, వయస్సు 70 సంవత్సరాలు పైన ఉన్నవారిని అరెస్టు చేయటం తగదని సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడటం దురదృష్టకరమని జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ వరప్రసాదు అన్నారు. వైసీపీ పాలనలో నారా చంద్రబాబునాయుడు, రంగనాయకమ్మ, అంకారావులను అక్రమంగా అరెస్టు చేసినప్పుడు సజ్జల రామకృష్ణారెడ్డికి వారి వయస్సు గుర్తు రాక పోవటం శోచనీయం అన్నారు. రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇచ్చిన వారిపట్ల ఇప్పటికీ సజ్జలకు మంచి అభిప్రాయం లేదని ఆయన మాటల్లోనే తెలుస్తుందని, సజ్జలపై కూడా కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మహిళలను అవమానించడం హేయం

బెల్లంకొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని మహిళలను అవమానించేలా మాట్లాడటం హేయమని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్‌షరీఫ్ అన్నారు. సోమవారం బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలపై అసభ్యకరంగా మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల నాయకులు గుడిసె కొండయ్య, వెన్నా సీతారామిరెడ్డి, హనుమంతరావు నాయక్, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, కొండవీటి ఇబ్రహీం, సయ్యద్ జానీ, పీఎస్‌కే రసూల్, ఎస్ పిచ్చయ్య, అహమ్మద్, చిట్టి, డీలర్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో గర్భిణులకు ఆరోగ్యం

అమరావతి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వలన పుట్టే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటారని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ ఎం హరిబాబు అన్నారు. సోమవారం జనచైతన్య సమితి ఆధ్వర్యంలో బుచ్చియ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరరావు సహకారంతో వైద్యశాలకు వచ్చిన గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా డాక్టర్ హరిబాబు వారికి ఆహారం అందజేశారు. తెలుగు రైతు కార్యదర్శి భాష్యం ఆంజనేయులు పాల్గొని వివిధ వైద్యసేవల కోసం వచ్చిన మహిళలకు పౌష్టికాహారం, పెరుగు అన్నం, గుడ్లు, డ్రైఫ్రూట్స్, అరటిపళ్లు అందజేశారు. కార్యక్రమంలో జనచైతన్య ప్రతినిధులు జి.విజయబాబు, ఎం శ్రీనివాసరావు, అశోక్, శంషుద్దీన్ పాల్గొన్నారు.



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ హరిబాబు తదితరులు

భగ్గుమన్న మహిళలు

❖ జగన్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలపై ఆందోళనలు
❖ పత్రికా కార్యాలయం ముట్టడి, పత్రికా ప్రతుల దహనం



పొన్నూరు పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన చేస్తున్న కూటమి నాయకులు, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర తదితరులు

పొన్నూరుటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలను కించపరిచే విధంగా భారతిరెడ్డిని ర్వహిస్తున్న సాక్షి చానల్‌లో చేయించిన అభ్యంతకర వ్యాఖ్యలు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయని ఎమ్మెల్యే, సంగం డెయిరి చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నూరు పట్టణంలో సాక్షి చానల్, పత్రికకు వ్యతిరేకంగా సోమవారం కూటమి పార్టీలు, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో మహిళలు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం జగన్‌కు చెందిన దిన పత్రిక ప్రతులను తగులబెట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా జర్నలిస్టు ముసుగులో ఉన్న కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజు మాట్లాడడం దారుణమన్నారు. సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా వారి వ్యాఖ్యలను ప్రసారం చేసిన సాక్షి యజమాని భారతిరెడ్డి తక్షణమే తమ పత్రిక, చానల్ ద్వారా బహిరంగ క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. లేకుంటే సాక్షి పత్రికను బహిష్కరించడంతో పాటు తమదైన రీతిలో నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. 11 సీట్లకు పరిమితమైన.. ప్రజా తీర్పుతో ప్రతిపక్ష హోదాను కోల్పోయిన జగన్‌లో ఇప్పటికి అహంకారం తగ్గలేదని ఆరోపించారు. మరోసారి అధికారం ఇవ్వలేదన్న అక్కసుతో తన చానల్‌లో మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతిశాడని ఆరోపించారు.

సాక్షి కార్యాలయాన్ని ముట్టడించిన తెలుగు మహిళలు

● కొమ్మినేని, కృష్ణంరాజు ఫొటోలు, పేపర్ ప్రతుల దహనం

గుంటూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని మహిళలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ తెలుగు మహిళలు గుంటూరు అరండల్ పేటలోని సాక్షి కార్యాలయాన్ని సోమవారం ఉదయం ముట్టడించారు.. దారుణమైన వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు, ఆ వ్యాఖ్యలను ప్రోత్సహించి ప్రసారం చేసిన కొమ్మినేని శ్రీనివాస్, చానెల్ యాజమాన్యాన్ని శిక్షించాలని డిమాండ్ చేశారు. తెలుగు మహిళ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షురాలు దాసరి జ్యోతి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని కొమ్మినేని, కృష్ణంరాజు ఫొటోలు, దిన పత్రికా ప్రతులను తగులపెట్టారు. చెప్పులు చూపిస్తూ నిరసన తెలిపారు. చానల్ ఎండీ భారతిరెడ్డి, జగన్మోహన్ రెడ్డి ఖండించనందుకు మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళా నాయకులు పాల్గొన్నారు.



కొమ్మినేని, కృష్ణంరాజు ఫొటోలు, పేపర్ ప్రతులను తగలబెడుతున్న మహిళలు

పత్రికా కార్యాలయం వద్ద మహిళల ధర్నా

❐ భారతీ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్
❐ బారికేడ్లు అడ్డుపెట్టి నిలువరించిన పోలీసులు

మంగళగిరి సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జగన్ మీడియాలో అమరావతి మహిళలను కించపరుస్తూ ఎనలిస్ట్ కృష్ణంరాజు, జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలపై మహిళల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతూనే ఉన్నాయి. అమరావతి రాజధాని ప్రాంత మహిళలు, రైతులు సోమవారం సాయంత్రం గుంటూరు జిల్లా మంగళగిరి తెనాలి రోడ్డులోని పత్రికా కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. కృష్ణంరాజు, కొమ్మినేని, యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమరావతి ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అమరావతి మహిళలు, రైతులపై అత్యంత జుగుప్సాకరమైన వ్యాఖ్యలను ప్రోత్సహించిన సాక్షి యజమాని భారతీ రెడ్డి మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులను అభినవ కీచకులు, వ్యవస్థీకృత నేరగాళ్లుగా అభివర్ణించారు. చెప్పులు, చీపుర్లు, చేటను చూపిస్తూ నిరసన తెలియజేశారు. గంటన్నరపాటు ఆందోళన నిర్వహించారు. మహిళల ఆందోళనతో మంగళగిరి సాక్షి కార్యాలయం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. అమరావతి మహిళలు పలుమార్లు లోపలకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు బారికేడ్లను అడ్డుగా పెట్టి నిలువరించారు. అయినప్పటికీ గేటు దూకే ప్రయత్నం చేశారు. పత్రిక నేమ్ బోర్డును ధ్వంసం చేశారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అనంతరం కార్యాలయం ఎదురుగా దిష్టిబొమ్మను దహనం చేశారు. కృష్ణంరాజు, కొమ్మినేని, సాక్షి యాజమాన్యంపై చర్యలు తీసుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



మంగళగిరి సాక్షి కార్యాలయం ఎదుట దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు

పత్రికా ప్రతుల దహనం

బాపట్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని మహిళలను అగౌరవ పరుస్తూ జగన్ మీడియా డిబేట్‌లో వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులపై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ తెలుగు మహిళలు, తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులతో కలిసి సూర్యలంక రోడ్డులోని టీడీపీ కార్యాలయం నుండి ర్యాలీగా అంబేడ్కర్ సర్కిల్ చేరుకున్నారు. సాక్షి పత్రిక ప్రతులను కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు ఫొటోలను దహనం చేశారు.



బాపట్ల అంబేడ్కర్ సర్కిల్‌లో సాక్షి పత్రిక పేపర్లు, కొమ్మినేని శ్రీనివాసరావు ఫొటోలు దహనం చేస్తున్న తెలుగు మహిళలు

మార్కెటింగ్‌లో బదిలీలలు

● కౌన్సెలింగ్ సందర్భంలో ఒక జాబితా రూపకల్పన ● చివరికి నలుగురిని మినహాయించి విడుదల ● నివ్వెరపోతున్న అధికార, ఉద్యోగ వర్గాలు



గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖలో బదిలీల ప్రక్రియ పూర్తి అయింది. సోమవారం రాత్రి 9 గంటల తర్వాత డిప్యూటీ డైరెక్టర్లు, సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ, అసిస్టెంట్ డైరెక్టర్లు, స్పెషల్ గ్రేడ్, గ్రేడ్-1, 2, 3 కార్యదర్శుల బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. తమకు బదిలీ ఉండదని భావించిన కొందరికి అనూహ్యంగా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ చేతిలో పెట్టారు. మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత సెలవులో ఉండటంతో ఆమె స్థానంలో ఇన్‌చార్జిగా ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారి కింది స్థాయి ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. సెక్రెటరీలు, ఏడీలు, డీడీల బదిలీ ఉత్తర్వులు మాత్రం స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ విడుదల చేశారు.

కాగా మిర్చి యార్డులో వివిధ హోదాల్లో ఉద్యోగుల బదిలీల్లో పెద్ద ఎత్తున పైరవీలు కొనసాగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కౌన్సెలింగ్ సందర్భంగా విజిలెన్స్ కేసులో ఉన్న 18 మందితో పాటు మరికొందరిని కూడా బదిలీ చేసేందుకు నిర్ణయించారు. అయితే కమిషనర్ విజయ సునీత సెలవులోకి వెళ్లడం, ఆ తర్వాత ఎస్‌డబ్ల్యూసీ ఎండీ ఇన్‌చార్జిగా రావడంతో చాలా మార్పులు జరిగాయి. మిర్చి యార్డు ఇన్‌చార్జిగా ఉన్న సుబ్రహ్మణ్యం డిప్యూటేషన్‌ని రద్దు చేసి సంతనూతలపాడుకు రివర్ట్ చేశారు. తాడికొండ సెక్రటరీ పద్మావతి డిప్యూటేషన్‌పై యార్డులో విధులు నిర్వహిస్తుండగా కౌన్సెలింగ్‌లో ఆమెను వెనక్కు పంపాలని నిర్ణయించారు. అయితే బదిలీ ఉత్తర్వుల్లో పద్మావతిని గుంటూరు ఏఎంసీలోనే డిప్యూటేషన్‌పై కొనసాగించారు. అలానే యూడీసీ నరేంద్ర, వివిధ గ్రేడ్‌ల సెక్రటరీలు శ్రీకాంత్, ఆంజనేయులుని కూడా కౌన్సెలింగ్‌లో వేరే ఏఎంసీలకు మార్కింగ్ చేశారు. అయితే తుది ఉత్తర్వుల్లో వాళ్లని బదిలీ నుండి మినహాయించారు. మిర్చి యార్డులో బదిలీల వెనక రాజకీయ, అధికారుల సిఫార్సులు, నగదు బాగా పని చేశాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

- డిప్యూటీ డైరెక్టర్ హోదాలో విజయవాడ ఏఎంసీలో విధులు నిర్వహిస్తున్న ఎం.దివాకర్‌ని గుంటూరు మార్కెటింగ్ డీడీగా, దుగ్గిరాల సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ ఎన్.శ్రీనివాసరావుని కొవ్వూరు ఏఎంసీకి, గుంటూరు డీడీ కె.ఝాన్సీరాణిని తణుకు ఏఎంసీ సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరిగా, పొన్నూరు ఏఎంసీ సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరి పి.రామారావుని పెనుగొండ ఏఎంసీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.
- సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీల హోదాలో తెనాలి ఏఎంసీకి చెందిన జేవీ సుబ్బారావుని దుగ్గిరాలకు, చిలకలూరిపేట ఏఎంసీకి చెందిన యూ యోగేశ్వరరావుని ఆకివీడుకు, భీమవరం ఏఎంసీకి చెందిన జి.ప్రసన్నకుమారిని పొన్నూరు ఏఎంసీకి, ఆకివీడు ఏఎంసీ నుంచి డీసీహెచ్ సుబ్బారావు తెనాలి ఏఎంసీకి, తణుకు ఏఎంసీ నుంచి డి.తిరుపతిరాయుడు చిలకలూరిపేటకు బదిలీ అయ్యారు.
- అసిస్టెంట్ డైరెక్టర్ హోదాలో ఒంగోలు ఏడీఎం కేవీఎస్ ఉపేంద్ర నరసరావుపేట ఏఎంసీకి, గుంటూరు ఏడీఎం బి.రాజబాబు తిరువూరు ఏఎంసీకి స్పెషల్ గ్రేడ్ సెక్రటరీగా, నరసరావుపేట ఏఎంసీ నుండి కె. సూర్యప్రకాష్‌రెడ్డిని అద్దంకికి, అనంతపురం ఏడీఎం పి.సత్యన్నారాయణ చౌదరి గుంటూరు ఏడీఎంగా, మంగళగిరి సెక్రెటరి ఎ.భాస్కరరెడ్డిని కూచినపూడికి బదిలీ చేశారు.

12న సుపరిపాలన - స్వర్ణాంధ్ర

వెలగపూడి సచివాలయం దగ్గర్లో కార్యక్రమం
పాల్గొననున్న సీఎం చంద్రబాబునాయుడు
ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ సూచనలు



సుపరిపాలన - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మీ, ఎస్పీ సతీష్ కుమార్

తుళ్లూరు,(వెలగపూడి) జూన్ 9(ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం పూర్తి అయ్యింది. ఈ నెల 12న సుపరిపాలన - స్వర్ణాంధ్ర కార్యక్రమాలు మండల కేంద్రాలు, నియోజకవర్గాల్లో నిర్వహించాలని సీఎం చంద్రబాబు నాయుడు కూటమి నేతలకు సూచించారు. వెలగపూడి సచివాలయం దగ్గర్లో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. సోమవారం కార్యక్రమ ప్రదేశాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అధికారులతో కలసి పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు తగిన సూచనలు చేశారు. పకడ్బందీగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పరిశీలనలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ భార్గవ తేజ, రాష్ట్ర ప్రొటో కాల్ డైరెక్టర్ మోహనరావు, గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మురళీకృష్ణ, తుళ్లూరు తహసీల్దారు ఉన్నారు.

80.19 శాతం రేషన్ పంపిణీ

మూడు జిల్లాల్లో 13.19 లక్షల కార్డులకు..



రేషన్ కోసం షాపు వద్ద మహిళలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి):

ఆటోలను తొలగిస్తే రేషన్ పంపిణీ కష్టమవుతుంది. కార్డుదారులు ఇక్కట్లు పడతారని నానా యాగీ చేసిన వైసీపీకి.. కూటమి ప్రభుత్వం ఆచరణలో రేషన్ పంపిణీ చేసి.. సమాధానం చెప్పింది. ఆటోలు లేకున్నా సకాలంలో కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయడం సాధ్యమేనని నిరూపించింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో తొమ్మిది రోజుల్లోనే 13,19,712 కార్డులకు రేషన్ పంపిణీ చేయడం జరిగింది. మరో ఆరో రోజుల పాటు రేషన్ పంపిణీ జరగనుంది. వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకే వెళ్లి డీలర్లు బియ్యం అందజేశారు. నేరుగా ఇంటికే బియ్యం పంపిణీ చేయడంతో ఆయా వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. గతంలో వృద్ధులు, దివ్యాంగులు ఆటోల వద్ద క్యూలో నిల్చొని బియ్యం తీసుకోవాల్సి వచ్చేది. ఆ కష్టాలను కూటమి ప్రభుత్వం తొలగించింది.

కార్డుదారులకు బియ్యం పంపిణీలో పల్నాడు జిల్లా 80.19 శాతంతో ముందు వరుసలో నిలిచింది. ఈ జిల్లాలో 6,34,893 కార్డులు ఉండగా సోమవారం నిర్ణీత సమయం ముగిసే సరికి 5,12,914 కార్డుదారులకు రేషన్ పంపిణీ చేసినట్లు పౌర సరఫరాల శాఖ లెక్కలు తెలిపాయి. బాపట్ల జిల్లాలో 77.35 శాతం కార్డులకు అంటే.. 4,76,529 కార్డులకు గాను 3,68,600 కార్డులకు రేషన్ అందింది. గుంటూరు జిల్లాలో 5,89,531 కార్డులు ఉండగా 4,38,198 కార్డులకు రేషన్ పంపిణీ చేశారు. మరో రెండు రోజుల్లో రేషన్ పంపిణీ పూర్తి అవుతుందని సదరు అధికారులు తెలిపారు. రేషన్ పంపిణీపై వైసీపీ చేసిన విమర్శలను ప్రభుత్వం తిప్పికొట్టడంలో సక్సెస్ అయింది. పింఛన్‌ల పంపిణీ తరహాలోనే రేషన్ కూడా లబ్ధిదారులకు ప్రభుత్వం సకాలంలో అందజేస్తుండటంతో కార్డుదారుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

అత్యవసర బాధలకు చెక్!

❖ పర్యావరణ హితంగా పోర్టబుల్ ఈ-టాయిలెట్లు
❖ మంగళగిరి, తాడేపల్లిలో ఏర్పాటుకు సన్నాహాలు
❖ మంత్రి లోకేశ్ చొరవతో తీరనున్న బాధలు..
❖ చంటి బిడ్డలకు పాలిచ్చే సౌకర్యం కూడా..



మంగళగిరికి చేరుకున్న ఈ-టాయిలెట్లు

మంగళగిరి సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ ప్రజలకు ఈ-టాయిలెట్లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. పూర్తి పర్యావరణ హితంగా దుర్గంధం, దుర్వాసన లేని ఈ-టాయిలెట్లను మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేసేందుకు నిత్యం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ పలు సూచనలు చేస్తున్నారు. దీనిలో భాగంగానే హైదరాబాద్, బెంగళూరు వంటి మహానగరాల్లో ఏర్పాటు చేసిన దుర్వాసన లేని ఈ-టాయిలెట్లను తన సొంత నిధులతో నియోజకవర్గంలోని ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేయించాలని నిర్ణయించారు.

పెరిగిన జనాభా..

అమరావతి రాజధాని ప్రాంతానికి ముఖద్వారంగా ఉన్న మంగళగిరి పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. గతంలో 2014-19 మధ్య కాలంలో అమరావతి నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్న సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది కార్మికులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు ఇక్కడికి వలస వచ్చారు. ఆ తర్వాత వైసీపీ హయాంలో రాజధాని నిర్మాణ పనులు ఆగిపోవడంతో కార్మికులు, చిరు వ్యాపారులు సొంత రాష్ట్రాలకు వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి పనులు ఊపందుకోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి మళ్లీ భారీగా కార్మికులు, చిరు వ్యాపారులు ఇక్కడికి చేరుకున్నారు. వ్యాపార మార్కెట్ రోజు రోజుకు గణనీయంగా పెరుగుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీంతోపాటు వివిధ పనుల నిమిత్తం అనేక మంది నిత్యం మంగళగిరి వస్తుంటారు. స్థానికంగా అనేక దుకాణాల్లో పనిచేసే గుమస్తాలు, మహిళా ఉద్యోగులు, కార్మికులకు పబ్లిక్ టాయిలెట్లు, మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో బాధ పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను గమనించిన మంత్రి నారా లోకేశ్ కొత్త తరహా ప్రజా మరుగుదొడ్ల నిర్మాణంపై దృష్టి సారించారు. అధునాతన టెక్నాలజీతో కూడిన ఈ-టాయిలెట్లను ఇక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

తొలుత ఆ రెండు ప్రాంతాల్లో..

తొలుత అత్యంత రద్దీగా ఉండే మంగళగిరి పాత బస్టాండు సెంటరు, తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రి సమీపంలో రెండు ఈ-టాయిలెట్లను ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. భవిష్యత్తులో నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయనున్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఈ-టాయిలెట్లను ఏర్పాటు చేయడంతోపాటు చంటి బిడ్డలకు పాలు ఇచ్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లను కూడా చేయనున్నారు. భవిష్యత్తులో నగరంలో రహదారుల విస్తరణ జరిగితే ప్రీఫ్యాబ్ టెక్నాలజీతో తయారు చేసిన పోర్టబుల్ ఈ-టాయిలెట్లను వేరే ప్రాంతానికి సులువుగా తరలించే అవకాశం ఉంది. ఈ-టాయిలెట్ల ఏర్పాటుకు మంత్రి లోకేశ్ చర్యలు తీసుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

చిలకలూరిపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సరైన ఆహారపు అలవాట్లు, మానసిక ఆరోగ్యం, శారీరక వ్యాయామంతో అనేక వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని హోమియో వైద్యురాలు డాక్టర్ సిద్దాబత్తుని ఉమాదేవి సోమవారం చెప్పారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, ఉమాస్ హోమియో క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని సుగాలీ కాలనీలో సోమవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించి 80మందిని పరీక్షించి, ఉచితంగా మందులు అందచేశారు. ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని, కార్యదర్శి నార్నె జయలక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

మార్కెట్ యార్డు కార్యదర్శి బదిలీ

చిలకలూరిపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మార్కెట్ యార్డు కొత్త కార్యదర్శిగా డి.తిరుపతిరాయుడు సోమవారం నియమితులయ్యారు. ఈమేరకు మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు వెలువడ్డాయి. తణుకు నుంచి ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ కార్యదర్శిగా ఉన్న యు.యోగేశ్వరరావు ఆకివీడుకు బదిలీ అయ్యారు.

గ్రీవెన్స్‌లో ఒక ఫిర్యాదు

రొంపిచర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఒక ఫిర్యాదు అందినట్టు తహసీల్దార్ బండి నిర్మల తెలిపారు. అన్నవరం గ్రామం నుంచి సర్వేకోసం దరఖాస్తు అందినట్టు పేర్కొన్నారు. మండలంలోని భూములకు సంబంధించిన సమస్యలను ప్రతి సోమవారం జరిగే కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

చిలకలూరిపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జెండాను ఎగురవేశారు. సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, రాష్ట్ర డెయిరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ సివిల్ సర్వీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో శాశ్వత సభ్యత్వం ఉన్న సంఘం ఎస్టీయూ అన్నారు. ఏపీ జేఏసీలో ప్రముఖ పాత్ర వహిస్తూ, పోరాటాలకు స్ఫూర్తినిచ్చిన సంఘం ఎస్టీయూ అన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వినుకొండ అక్కయ్య, చావలి మల్లేశ్వరరావు, మేకల కోటేశ్వరరావు, వడ్లన అజయ్ ప్రకాష్, బొంతా రవి పాల్గొన్నారు.

హిందూ స్కూల్‌లో కరాటే పోటీలు

నరసరావుపేట కల్చరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవోదయ నగర్‌లోని హిందూ స్కూల్‌లో సోమవారం రోడ్ ట్రాక్ ఫినిక్స్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్‌టెస్ట్ పోటీలు నిర్వహించారు. పోటీలలో 150మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు చెప్పారు. కాగా పోటీలలో ద్రోణా అకాడమీ ఆఫ్ మాస్టర్ లార్డ్స్ నుంచి ఎక్కువమంది విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో హిందూ స్కూల్ ప్రిన్సిపాల్ మానస, కాల్వ రవి, రొటేరియన్ గని, పి.రాంబాబు, జి.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ ముగింపు మహోత్సవం

నరసరావుపేట టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రావిపాడు రోడ్డులో శ్రీవెంకటేశ్వరయోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో జల్లి శ్రీనివాసరావు నిర్వహించిన ఉచిత యోగ ముగింపు ఆనందోత్సవం సోమవారం జరిగింది. సేవా కేంద్రం వ్యవస్థాపకుడు ఏ వెంకటేశ్వర యోగి గురూజీ చరవాణిలో సందేశాన్ని అందజేశారు. యోగాకు 28రోజులు పాటు హాజరైనవారికి ప్రతిభా పుస్కారాలను అందజేశారు. ముఖ్య అతిథిగా కనుమూరి రాజ్యలక్ష్మి, వంకాయల హరగోపాల్, సహాయక గురువులు బండి కొండారెడ్డి, రావూరి సాంబశివరావు, రాగిడి నాగలక్ష్మయ్య, పూనూరి కృష్ణకుమారి, బొగ్గారపు బ్రహ్మానందం, యోగ అభ్యాసకులు పాల్గొన్నారు.

సంతగుడిపాడులో పంచాయతీ కార్యదర్శి లేక ఇక్కట్లు

రొంపిచర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతగుడిపాడులో పంచాయతీ కార్యదర్శి లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నట్టు గ్రామస్థులు సోమవారం తెలిపారు. సుమారు రెండు నెలల నుంచి పంచాయతీ కార్యదర్శి లేరని పేర్కొన్నారు. ఇన్‌చార్జ్‌గా రొంపిచర్ల పంచాయతీ కార్యదర్శికి బాధ్యతలు అప్పగించారని అయితే సదరు కార్యదర్శి బాధ్యతలు తీసుకున్న దాఖలాలు లేవు. నిత్యం పంచాయతీతో గ్రామస్థులకు పనులు ఉంటాయి. పంచాయతీ కార్యదర్శిని నియమించేలా అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

వసతి గృహాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఈపూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఈపూరులోని ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రవేశం కోసం ఈ నెల 12వ తేదీ నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు ఆయా హాస్టల్ వార్డెన్లు సోమవారం తెలిపారు. వసతి గృహాల్లో చేరే విద్యార్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ అకౌంటులను వెంట తెచ్చుకోవాలన్నారు.

పాఠశాలలకు పుస్తకాల తరలింపు

నూజెండ్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు 2025 - 26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం నుంచి వచ్చిన స్కూల్ బ్యాగ్స్, బెల్టులు, యూనిఫాం, నోట్ పుస్తకాలు, టెస్టు పుస్తకాలు, బూట్లు, డిక్షనరీలను మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం అందజేసినట్లు ఎంఈవో రవిచంద్ర శుక్రవారం తెలిపారు. స్కూల్ ప్రారంభం రోజునే విద్యార్థులకు కిట్లను అందజేసేలా ఉపాధ్యాయులకు సూచన చేసినట్టు ఎంఈవో తెలిపారు.

ఇలాగేనా స్వచ్ఛ నరసరావుపేట..!



బాలయ్య నగర్ ప్రధాన రహదారిపై పేరుకుపోయిన వ్యర్థాలు



చెత్తమయంగా సిద్ధార్థ స్కూల్ వెనుక రోడ్డు

● చెత్తమయంగా రహదారులు

నరసరావుపేట రహదారులు చెత్తమయంగా మారాయి. సోమవారం పట్టణంలోని చాలా విధుల్లో పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయాయి. వర్థాలు కుళ్లి రోడ్డులు కంపుకొడుతున్నాయి. వ్యర్థాల తొలగింపుకు నోచుకొలేదు. పారిశుద్ధ పనుల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడింది. నెలకు రూ కోట్లు ఖర్చు చేస్తున్నా పరిశుభ్రత నెలకొవడం లేదు. ప్రభుత్వం పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని ఆదేశిస్తున్నా అధికారులకు ఆ మాటలు వినిపించడంలేదు. వర్షాలు కురిసే సందర్భంలో ఇలానే వ్యర్థాలు రహదారులపై పెరుకుపోతుండటంతో పుర పౌరులు ఇక్కట్లకు గురవుతున్నారు. పరిశుభ్రపై ఇకనైనా పుర పాలకులు దృష్టి సారించాలి.

- నరసరావుపేట, ఆంధ్రజ్యోతి



రామిరెడ్డి పేటలో సగం రహదారిని ఆక్రమించిన వ్యర్థాల గుట్టలు

మహిళలను కించపరిచిన వారిని అరెస్టు చేయాలి

● తెలుగు మహిళా నేతల డిమాండ్



సాక్షి కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న తెలుగు మహిళా నేతలు, కార్యకర్తలు

నరసరావుపేట టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తల్లిలాంటి అమరావతి, పరిసర ప్రాంత మహిళలను కించపరుస్తూ సాక్షి చానల్‌లో మాట్లాడిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయాలని తెలుగు మహిళా నేతలు డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని సాక్షి కార్యాలయాన్ని జిల్లా తెలుగు మహిళల ఆధ్వర్యంలో సోమవారం ముట్టడించి నిరసన తెలిపారు. అనంతరం పల్నాడు జిల్లా తెలుగుదేశం కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలుగు మహిళా నేతలు మాట్లాడుతూ సాక్షి చానల్‌లో రాష్ట్ర రాజధానిపై దుష్ప్రచారం చేయించినందుకు జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సాక్షి ఛానల్‌ను వెంటనే మూసివేయాలన్నారు. అమరావతి ప్రాంత మహిళలను వేశ్యలుగా మాట్లాడిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. లేనిపక్షంలో మహిళలందరూ చెప్పులతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సాక్షిలో ఐదు కోట్ల మంది భవిష్యత్‌తో ముడిపడిన రాష్ట్ర రాజధాని విషయంలో విషం చిమ్ముతూనే ఉన్నారని అన్నారు. సాక్షి డిబేట్‌లో జర్నలిస్టుల ముసుగులో ఉన్న సంస్కారహీనులు, కిరాయి బ్యాచ్ మహిళలను కించపరుస్తూ నీచపు వ్యాఖ్యలను చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు వేగుంట రాణి, గద్దె అనందలక్ష్మి, రాష్ట్ర అంగన్‌వాడీ కార్యదర్శి గంగినేని లీలావతి, తెలుగు మహిళా పల్నాడు జిల్లా అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ, పల్నాడు జిల్లా అంగన్‌వాడీ అధ్యక్షుడు క్రోసూరి రాధిక, మాజీ కౌన్సిలర్ కధం నాగజ్యోతి, ఉడతా రాజలక్ష్మి, దావులూరి విజయలక్ష్మి, శారద, మొగిలిపువ్వు నాగలక్ష్మి, కృష్ణకుమారి, మునికొండ రంగమ్మ, దామచర్ల శివపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

విషం చిమ్ముతున్న సాక్షి: టీడీపీ లీగల్ సెల్ సభ్యుల ఆగ్రహం

సాక్షి చానల్‌ను అడ్డం పెట్టుకొని రాష్ట్రంపైన, అమరావతి మహిళలపై విషం చిమ్ముతున్నారని టీడీపీ లీగల్ సెల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ లీగల్ సెల్ సభ్యులు మాట్లాడుతూ అమరావతి మహిళలను వేశ్యలుగా సాక్షి మీడియా డిబేట్‌లో కృష్ణంరాజు మాట్లాడటం, కొమ్మినేని శ్రీనివాసరావు వంత పలకడం అత్యంత సిగ్గుచేటన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి భార్య భారతిరెడ్డి కూడా అమరావతి ప్రాంతంలో నివాసం ఉంటున్నట్లు మీడియా మరచిపోయినట్లుందని అన్నారు. అమరావతిని కించపరిచేలా మాట్లాడిన కృష్ణంరాజును బహిరంగంగా ప్రభుత్వం శిక్షించాలని, సాక్షి మీడియాని మూసివేయించాలని డిమాండ్ చేశారు. సాక్షి మీడియాలో వచ్చిన కథనాలపై వెంటనే విచారణ జరిపి ద్రోహులను శిక్షించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ అలీబాష, జిల్లా లీగల్ సెల్ సభ్యులు చెన్నుపాటి నాగేశ్వరరావు, దాసరి ఉదయశ్రీ, అబ్బూరి ఏడుకొండలు, ఉపాని సత్యనారాయణ, కోసూరి రాధిక పాల్గొన్నారు.

యోగాంధ్రపై అవగాహన ర్యాలీ



యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నరసరావుపేట కల్చరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేలు పాల్గొన్నారు. ర్యాలీ పెద్ద చెరువు నుంచి గడియార స్తంభం వరకు సాగింది. తొలుత పల్నాడు బస్టాండ్ వద్ద పెద చెరువు రోడ్డులో యోగాభ్యాస కార్యక్రమం జరిగింది. కార్యక్రమం రెవెన్యూ శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖలు సంయుక్తంగా నిర్వహించాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మురళి, రెవెన్యూ డివిజినల్ అధికారులు మధులత, మురళీకృష్ణ, రమాకాంత్‌రెడ్డి, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి మధుకీర్తి తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండలంలోని 11 సచివాలయాల పరిధిలో సోమవారం ర్యాలీలు నిర్వహించారు. శావల్యాపురంలో ఎంపీడీవో సీతారామయ్య, తహసీల్దార్ అర్జున్ నాయక్, ఈవోపీఆర్డీ సుగుణ, ఏపీవో రామారావులు పాల్గొని యోగాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీఈవో మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడిని అధిగమించి ప్రశాంతత పొందవచ్చని, సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. మండలంలోని 11సచివాలయాల పరిధిలో 15,267మందితో యోగాంధ్రకు రిజిస్ట్రేషన్లు చేయించాలని ప్రభుత్వం లక్ష్యంగా కేటాయించగా 15,418మందితో రిజిస్ట్రేషన్లు చేయించామన్నారు. ఈ నెల 21న యోగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మండలంలో 112చోట్ల స్థలాలు ఎంపిక చేశామన్నారు. అవకాశాన్ని బట్టి విశాఖపట్నంలో గానీ,



శావల్యాపురంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

విస్తృతంగా వాహన తనిఖీలు

యడ్లపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమావళి అమలుకోసం పోలీసులు సోమవారం సాయంత్రం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. యడ్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన ఈ తనిఖీలలో ప్రయాణికులను అనధికారికంగా తరలిస్తున్న ఐదు ట్రాన్స్‌పోర్టు వాహనాలను గుర్తించారు. మోటారు వాహన చట్టం ప్రకారం ఆయా వాహనాలకు రూ.3వేలు జరిమానా విధించి వాహన డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టి నిబంధనలకు విరుద్ధంగా రవాణాచేస్తున్న వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వాహన పత్రాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ శివరామకృష్ణ

● నూజెండ్ల : మండలంలో ఐనవోలు ఎస్ఐ బీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో వాహనాలను మండలంలోని సీతారామపురం సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అధిక లోడుతో పాటు లారీల్లో, ఆటోల్లో కూలీలను తరలించటం నేరమని, లైసెన్సులు, వాహనాలకు సరైన పత్రాలు లేని వారికి చలానాలు విధించారు.

● బొల్లాపల్లి: మండలంలోని మూగచింతలపాలెం వద్ద పల్నాడు వినుకొండ రూరల్ సీఐ టీ ప్రభాకర్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం బొల్లాపల్లి ఎస్ఐ బాలకృష్ణ వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు విరుద్ధంగా ఉన్న పది వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రత దృష్ట్యా ఇటువంటి తనిఖీలు ఇకపై మరింత కఠినంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.



మూగ చింతపల్లి వద్ద తనిఖీలు చేస్తున్న ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది

ఈశ్వర్ కళాశాల అధ్యాపకురాలు వాసంతికి డాక్టరేట్

నరసరావుపేట రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎమర్జింగ్ టెక్నాలజీ విభాగాధిపతి పి.వాసంతికి విజ్ఞాన్ డీమ్డ్ యూనివర్సిటీ (గుంటూరు) నుంచి డాక్టరేట్ పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు తెలియజేశారు. 'డిటెక్షన్ ఆఫ్ స్మాల్ అండ్ డెన్స్ ఆబ్జెక్ట్స్ యూజింగ్ యోలో వీ ఫైవ్ అండ్ ట్రాన్స్‌ఫార్మర్, బేస్డ్ డీప్ లెర్నింగ్ మోడల్స్' అనే అంశంపై గైడ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లావణ్య మోహన్ ఆధ్వర్యంలో పరిశోధన చేశారు. ఉన్నత విద్య అభ్యసించేందుకు సహకరించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావుకు, కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, తన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కరీం మోహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ మస్తాన్ షరీఫ్, వివిధ శాఖల విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్ అరుణ్‌బాబు నుంచి అవార్డులు అందుకుంటున్న వెల్లటూరు విద్యార్థులు

ఆరుగురు విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు

బొల్లాపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులు కలెక్టర్ పీ అరుణ్ బాబు నుంచి సోమవారం నరసరావుపేటలో షైనింగ్ స్టార్ అవార్డులను అందుకున్నారు. మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులకు, బొల్లాపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్ నుంచి ఒకరికి ఈ అవార్డు దక్కింది. అవార్డులు అందుకున్న వారిలో వెల్లటూరు నుంచి సాయి అమృత, నీలానాయక్, వసంతలక్ష్మి, డీ శిరీష, ధీరజ్ శ్రీరామ్, బొల్లాపల్లి నుంచి వై.హర్షిత అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో వెల్లటూరు ప్రధానోపాధ్యాయురాలు బ్యూలా హోసన్న, చంద్రజిత్ పాల్గొన్నారు.

● శావల్యాపురం: నరసరావుపేట పట్టణంలోని భువనచంద్ర టౌన్ హాలులో సోమవారం జరిగిన ప్రతిభావంతులు అవార్డుల ప్రదానోత్సవంలో శావల్యాపురం మండలంలోని మూడు జడ్పీ పాఠశాలల నుంచి ఆరుగురు బాలికలు కలెక్టర్ అరుణ్‌బాబు నుంచి అవార్డులు అందుకున్నారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన పద్మనాభుని జ్యోతిర్మయి, లింగాల గాయత్రి, చెన్నంశెట్టి శివనాగలక్ష్మి, అమృతపూడి అమృత వర్షిణి, వేల్పూరు జడ్పీ పాఠశాలకు చెందిన కామేపల్లి నాగరోషిణి, పోట్లూరు జడ్పీ పాఠశాలకు చెందిన సొలస రూపశ్రీ ప్రతిభావంతులు అవార్డులు పొందారు.



అవార్డులు అందుకొన్న శావల్యాపురం మండల విద్యార్థినులతో హెచ్ఎం విజయలక్ష్మి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి 162 అర్జీలు స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీకి అర్ధవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో మురళి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



మురికిపూడిలో భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ హుస్సేన్

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు

● తహసీల్దార్ హుస్సేన్

చిలకలూరిపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామ పరిధిలోని వాగు పోరంబోకు, అసైన్డ్ భూములు క్రయవిక్రయాలు జరిపే వారిపైన, అన్యాక్రాంతం, ఆక్రమణలు చేసే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని చిలకలూరిపేట తహసీల్దార్ మహ్మద్‌హుస్సేన్ సోమవారం తెలిపారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆయన మురికిపూడిలో పర్యటించి రెవెన్యూ రికార్డుల ప్రకారం భూముల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మురికిపూడిలో బొటు వీరాంజనేయ స్వామి వారి గుడి వెనుక కొండ పక్కనే ఉన్న 128 ఎకరాల 72 సెంట్లు వాగు పోరంబోకు భూమి ఉంది. ఆ భూమిలో 68 ఎకరాలు 1953లో 60మంది పేద ప్రజలకు సాగు భూమిగా పట్టాలు ఇచ్చారు. ఈ భూమిలో విలువైన గ్రానైట్ నిక్షేపాలు ఉండడంతో కొందరు ఈ భూమిలో తమకు కూడా పట్టాలు ఇచ్చారంటూ కోర్టులో రిట్ పిటిషన్ వేశారు. ఆ కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ సర్వే నెంబర్ భూమిలో 60 ఎకరాలు ప్రభుత్వ ఆధీనంలో ఉంది. ఇదిలా ఉంటే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు జేసీబీతో మొత్తం 128ఎకరాలు చుట్టూ మట్టితో కట్టలు వేసి ఆక్రమించే ప్రయత్నంలో ఉన్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు అందింది. భూములను పరిశీలించిన తహసీల్దార్ ఇది వాగు పోరంబోకు, అసైన్డ్ భూమి అని స్పష్టం చేశారు. ఈ భూమిని ఎవరు కొనటానికి, అమ్మటానికి వీలు లేదని తెలిపారు. ఆర్ఐ రమీజా, మండల సర్వేయర్, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు జవ్వాజి మదనమోహన్ పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

రొటీన్ వ్యాక్సినేషన్లపై వైద్యాధికారులకు శిక్షణ

నరసరావుపేట లీగల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రొటీన్ వ్యాక్సినేషన్లపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ బి.రవి సోమవారం ప్రారంభించారు. పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో సోమవారం నుంచి మూడు రోజులపాటు కొనసాగనుంది. ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ఆరోగ్య కేంద్రం, ఏరియా, సామాజిక ఆసుపత్రుల నుంచి 90మంది వైద్యాధికారులు హాజరయ్యారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలన్స్ వైద్యాధికారి డాక్టర్ మౌనిక శిక్షణ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీకాల అధికారి డాక్టర్ బీ. గీతాంజలి, జిల్లా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.పద్మావతి, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.



శావల్యాపురంలో శిక్షణను పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామయ్య

కుట్టుమిషన్‌ల శిక్షణతో మహిళలకు జీవనోపాధి

● శావల్యాపురం ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల జీవనోపాధులను మెరుగుపరిచి వారు ఆర్థికంగా పురోగతిని సాధించేందుకు ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టుమిషన్‌ల శిక్షణను ప్రారంభించిందని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. జడ్పీ పాఠశాలల్లో నిర్వహిస్తున్న కుట్టుమిషన్‌ల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శిక్షణకు హాజరవుతున్న మహిళలతో మాట్లాడారు. శిక్షణకు గైర్హాజరవుతున్న వారిస్థానంలో మరొకరికి అవకాశం కల్పించాలని సూచించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 11 సచివాలయాల నుంచి 127మంది కుట్టుమిషన్‌ల శిక్షణకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికి 3 నెలలు శిక్షణ ఇచ్చి తర్వాత ప్రత్యేక పరీక్షలు నిర్వహించి నైపుణ్యం ఉన్నవారికి ప్రభుత్వం ధ్రువీకరణ పత్రాలతోపాటు కుట్టుమిషన్‌లను ఉచితంగా ఇస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే జీవనోపాధి మార్గాలు పెంచుకోవాలని, చిన్నతరహా వ్యాపారాల వైపు మొగ్గుచూపాలని, దానికి ప్రభుత్వం కూడా పెట్టుబడులకు సహకారాన్ని అందిస్తుందన్నారు. ఎంఈవో సాంబశివరావు, శిక్షణ నిర్వాహకురాలు బేబీరాణి పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు

నూజెండ్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి, నీలి నాలుక వ్యాధి నివారణకు ఈ నెల 30వ తేదీ వరకు ఉచితంగా జీవాలకు టీకాలు వేస్తున్నట్టు మండల పశు వైద్యాధికారి శివాజీ తెలిపారు. సోమవారం మండలంలో పశు వైద్య సిబ్బందితో కలసి జీవాలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ బ్లూ - 10 వైరెస్ సోకిన జీవాలు జ్వరంతో బాధ పడుతూ నోరు నాలుక, ఎర్రబడ్డటం, కాళ్ళ నొప్పితో ఆహారం తీసుకోక పోవటంతో అకస్మాత్తుగా మృతి చెందుతాయన్నారు. ముందు జీవా యజమానులు మండలంలోని జీవాలకు రోగ నిరోధక శక్తి పెంపొందేలా జాగ్రత్తలు తీసుకోవాలని, సకాలంలో వ్యాక్సిన్‌లు వేయించాలని సూచించారు.